PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 26 | పేజీలు : 8 | గురువారం 18 జూన్ 2026 | వెల : 4/-






## కుటుంబానికి జీవనోపాధి

- హనుమకొండలో అభిమానిని పరామర్శించిన పవన్ కల్యాణ్
- చల్లగా ఉండాలంటూ ప్రేమతో డైరీలో నోట్
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్
- బాలుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- అనంతరం భద్రకాళి అమ్మవారి ఆలయంలో బాబు పేరిట ప్రత్యేక పూజలు

# అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

- లంచాలు ఆర్జించే అధికారులపై అవినీతి నిరోధక శాఖ కొరడా
- ప్రభుత్వ స్వేచ్ఛతో దూకుడు పెంచిన ఏసీబీ
- గడిచిన సంవత్సరాల్లో రికార్డు స్థాయిలో కేసులు నమోదు
- ముందు వరుసలో పోలీసు, రెవెన్యూ శాఖలు
- అభివృద్ధి పనుల పేరుతో అవినీతికి పాల్పడుతున్న అధికారులు

హైదరాబాద్

ప్రస్తుతం కొందరు అధికారులు చాప కింద నీరులా అవినీతికి పాల్పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా లంచాలు తీసుకుంటూ అక్రమంగా ఆస్తులను పోగేసుకుంటున్నారు. ఇలాంటివి అధికమవు తుండటంతో అవినీతి నిరోధకశాఖ వీటిపై దృష్టిసారించింది. గడచిన 13 రోజుల్లోనే ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మూడు నమోదు చేసి అధికారుల చిట్టా బయటపెట్టింది. అక్రమార్కులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తుండటంతో అంతా అప్రమత్తమవుతున్నారు. నిదర్శనంగా పలు ఘటనలు అధికారిక లెక్కల ప్రకారం గడిచిన 13 రోజుల్లో ఏసీబీ - మిగతా3లో



## భారత్ ఆల్ టైమ్ రికార్డ్

- రక్షణ రంగ ఉత్పత్తుల విలువ రూ. 1.78 లక్షల కోట్లు
- రాజ్‌నాథ్ సింగ్ కీలక ప్రకటన
- భారత రక్షణ రంగంలో మరో చారిత్రాత్మక విజయం
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆల్ టైమ్ హైకి రక్షణ రంగ ఉత్పత్తుల విలువ- ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదు

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..


- ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం
- ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం
- ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి
- ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన



## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

- సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- సైబర్ నేరగాళ్లను సమాజానికి పరాన్నజీవులతో పోల్చిన సుప్రీంకోర్టు
- ఆన్‌లైన్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ
- అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్య
- ఎఫ్ఐఆర్‌ల విలీనానికి హైకోర్టులను ఆశ్రయించాలని నిందితుడికి సూచన
- ఇలాంటి నేరస్థులను జైల్లో ఉంచడమే సమాజానికి శ్రేయస్కరం అని వ్యాఖ్య





## ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

- పరీక్ష ఖర్చు విద్యా శాఖ బడ్జెట్‌తో సమానం
- భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు



- తెలంగాణ భవిష్యత్ పునర్నిర్మాణం తరగతి గదుల్లోనే ఉంది
- ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- ఇక్కడ మంచి నాయకత్వ లక్షణాలు ఉంటాయన్న రేవంత్
- ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ప్రభుత్వ విద్యావ్యవస్థను అభివృద్ధి దిశగా తీసుకెళ్లేలా రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ప్రభుత్వం నిర్మించిన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' (టీపీఎస్) భవనాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా, సుమారు రూ. 15 కోట్ల భారీ వ్యయంతో ఈ విద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఆరుట్లకు చేరుకున్న సీఎం, ముందుగా స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించి పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో - మిగతా3లో



### రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే

## తొలి ప్రాధాన్యత

- హౌసింగ్ అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి టెలీకాన్ఫరెన్స్
- గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యమని స్పష్టీకరణ
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెల్లో ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామని వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారు

హైదరాబాద్

గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చేందుకు సర్కారు ప్రత్యేక కార్యాచరణను చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గుడిసెలను గుర్తించేందుకు సమగ్ర సర్వే చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియపై - మిగతా3లో



## ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

- అమిత్ షాపై కాంగ్రెస్ విమర్శలు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు గుప్పించిన జైరాం రమేశ్
- ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణ
- భారీ ప్రలోభాలతో ఎంపీలు, ఎమ్మెల్యేలను బీజేపీలోకి ఆకర్షిస్తున్నారన్న కాంగ్రెస్ నేత



## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ

- భారత్‌పై దాడి జరిగితే అమెరికా అండగా ఉంటుందని ట్రంప్ హామీ
- మోదీ ఉన్నంత వరకు మద్దతు ఉంటుందని స్పష్టీకరణ
- ఒకవేళ కొత్త నాయకుడు వస్తే చెప్పలేనని వ్యాఖ్య
- జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ, ట్రంప్ ద్వైపాక్షిక భేటీ

నవగీతం
తెలుగు దినపత్రిక

గురువారం
18 జూన్ 2026

# ఈ వ్యవస్థతో పిల్లల కలలు నాశనం

భారత విద్యా విధానం పిల్లలపై ఒత్తిడిని పెంచి, వారిని మానసికంగా అణచివేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. ఈ వ్యవస్థ విద్యార్థులను ప్రధానంగా ఇంజనీరింగ్, వైద్యం, సివిల్ సర్వీసెస్ వంటి కొన్ని వృత్తి మార్గాల వైపు మాత్రమే మళ్లిస్తోందన్నారు. ఇతర రంగాల పట్ల ఆసక్తిని నిరుత్సాహపరుస్తోందని, పిల్లల కలలను నాశనం చేస్తుందని అన్నారు. కోచింగ్ కేంద్రాలకు ప్రసిద్ధి చెందిన రాజస్థాన్?లోని కోటాలో నిర్వహించిన 'ఛాత్రోన్ కి గూంజ్' (విద్యార్థుల గళం) మహా ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఆయన పేపర్ లీక్‌లు, నిరుద్యోగం వంటి వివిధ అంశాలపై విద్యార్థులతో ముఖాముఖి చర్చించారు.



"ఇది రాజకీయ సమావేశం కాదు. ఇది మీ గురించి, ఉజ్వల భవిష్యత్తు కోసం పోరాడుతున్న యువత కోసం జరుగుతున్న సమావేశం. మన దేశంలో పిల్లలను కేవలం ఐదు పనులు మాత్రమే ఎందుకు చేయమని అడుగుతున్నారు? దానికి సమాధానం 'డబ్బు'. ఎందుకంటే ఈ వ్యవస్థ ఆ ఐదు మార్గాల ద్వారానే డబ్బు సంపాదిస్తోంది. భారత విద్యా వ్యవస్థ ఒక దోపిడీ యంత్రం. యువత పెద్ద కలలు కనేలా ప్రోత్సహించే వ్యవస్థ మాకు కావాలి. దేశంలోని యువత తీవ్రమైన వేదన, ఒత్తిడి, అసంతృప్తికి గురవుతున్నారు. ఇది దేశానికి మంచిది కాదు." ఈ క్రమంలోనే చీజుజు, జీజుజు, ఖ్రూజ సివిల్ సర్వీసెస్ పరీక్ష, ౹ూజ, ==దీ వంటి పరీక్షలను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తామన్న గ్యారెంటీ లేకపోయినా, లక్షలాది మంది విద్యార్థులు పాఠశాల విద్య, కోచింగ్ సంస్థలు, యూనిఫాంలు హాస్టల్ వసతుల కోసం భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. చాలా తక్కువ సంఖ్యలో ఉండే పోస్టుల కోసం లక్షలాది మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని ఆయన అన్నారు. కేవలం చీజుజు పరీక్షకే దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతుండగా, లక్ష కంటే తక్కువ మంది మాత్రమే ఎంపికవుతున్నారని, ఇది చాలా కఠినమైన పోటీ అని అన్నారు. ఇటువంటి విధానాలు విద్యా వ్యవస్థను అత్యంత కఠినంగా, చాలా మందికి అవకాశాలు దక్కకుండా చేసేలా మారుస్తున్నాయని అభిప్రాయపడ్డారు.

విద్యా రంగ ఆర్థిక వ్యవస్థ ప్రతి ఏటా కుటుంబాల నుంచి భారీ మొత్తంలో డబ్బును వసూలు చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కేవలం ఒక పరీక్ష కోసమే విద్యార్థులు, వారి కుటుంబాలు కలిసి ప్రభుత్వ మొత్తం విద్యా బడ్జెట్‌కు సమానమైన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. చీజుజు పరీక్షకు 22 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వారు మొత్తం రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఇది విద్యా శాఖ బడ్జెట్ కేటాయింపులకు సమానమన్నారు.

"అనే ఐదు ప్రధాన పరీక్షలను విద్యార్థులు తమ కలలుగా భావిస్తారు. ఈ ఐదు పరీక్షల కోసం కుటుంబాలు కలిసి దాదాపు రూ. 3.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ మొత్తం విద్య, ఆరోగ్యం, కార్మిక, విజ్ఞాన శాస్త్రం, మహిళా-శిశు అభివృద్ధి వంటి మంత్రిత్వ శాఖలపై ప్రభుత్వం చేసే వ్యయంతో సమానం. ఇంత భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ, చాలా తక్కువ శాతం మంది విద్యార్థులు మాత్రమే స్థిరమైన ఉద్యోగాలను పొందుతున్నారు. మిగిలిన వారు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు. ప్రతి వెయ్యి మంది విద్యార్థుల్లో కొద్దిమందికి మాత్రమే జీతంతో కూడిన ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగిలిన వారు ఇబ్బందులు పడుతున్నారు."

ప్రతి 100 మంది ఇంజనీర్లలో దాదాపు 80 మంది నిరుద్యోగులుగా ఉన్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. యువత తమ జేబుల నుంచి లక్షలు, కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా, అత్యల్ప వ్యయంతోనే తమ కలలను సాకారం చేసుకునేలా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఐదుగురు విద్యార్థులతో రాహుల్? గాంధీ ముచ్చటించారు. చీజుజు, జీజుజు, సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారి కలలు, పరీక్షల సన్నద్ధత, వాటి కోసం వెచ్చించిన ఖర్చు, ఎంపిక అవకాశాల గురించి మాట్లాడారు.

# ప్రతిపక్ష నేతలను ఎన్‌డీఏలోకి లాగేందుకు ప్రయత్నాలు

కేంద్ర హోంమంత్రి అమిత్?షాపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమికి ప్రతీకారంగా ప్రతిపక్షాలపై దాడిచేయటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని ఆయన ధ్వంసం చేస్తున్నారని ఆరోపించింది. రెండేళ్ల క్రితం బీజేపీ-వ్యతిరేక అజెండాతో ఎన్నికైన వారిని ప్రలోభాలకు గురిచేసి ఎన్?డీఏ వైపు ఆకర్షిస్తున్నారని విమర్శించింది. పార్టీ ఫిరాయించేవారికి ఇచ్చే ప్రోత్సాహకాలు దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు.





**'మ్యూచువల్ ఫండ్స్ తరహా రాజకీయ వ్యూహం'**

ప్రతిపక్ష నేతలను ఆకర్షించేందుకు అనుసరిస్తున్న వ్యూహాన్ని జైరాం రమేశ్ "మ్యూచువల్ ఫండ్స్"తో పోల్చారు. ఎవరిని పార్టీలోకి తీసుకురావాలనుకుంటే వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసం సాగుతున్న చర్య అని విమర్శించారు. అమిత్ షా రాజకీయ వ్యూహాలకు హద్దులు లేవని, అయితే చివరికి ఆయన లక్ష్యం నెరవేరదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో నెలకొన్న ఊహాగానాలు, ఉద్ధవ్ వర్గం మరోసారి చీలనుందని వార్తలు వస్తోన్న నేపథ్యంలో జైరాం రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు.

**మహా రాజకీయాల్లో ఉత్కంఠ**

మహారాష్ట్రకు చెందిన ఎంపీలను కొనుగోలు చేసేందుకు రూ.15 కోట్ల అడ్వాన్స్ చెల్లిస్తున్నారనే సమాచారం తనకు అందిందని సంజయ్ రౌత్ ఆరోపించారు. ఈ వ్యవహారం షాకింగ్‌గా, అసహ్యకరంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో శివసేన (యూబీటీ)కు చెందిన కొందరు లోక్‌సభ సభ్యులు అధికార శివసేనలో చేరే అవకాశాలపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అధికార శివసేన నేత ప్రతాప్ సర్నాయక్ కూడా అసంతృప్త నేతలకు స్వాగతం పలుకుతామని సంకేతాలు ఇవ్వడంతో ఈ ప్రచారం మరింత బలపడింది.

**ఎంపీలకు విప్?**

ఇదిలా ఉండగా శివసేన (యూబీటీ) వర్గానికి చెందిన కొందరు లోక్‌సభ ఎంపీలు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు పార్టీ ఫిరాయింపు ప్రచారం మధ్యే శివసేన (యూబీటీ) వర్గం తమ ఎంపీలకు విప్ జారీచేసింది. దిల్లీలో జరిగే సమావేశానికి హాజరుకావాలని సూచించింది. కొందరు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేయనున్నారనే ప్రచారం మధ్య ఉద్ధవ్ వర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశానికి హాజరుకాని ఎంపీలపై అనర్హత వేటువేసే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన 9మంది లోక్‌సభ ఎంపీల్లో ఆరేడు మంది ఎంపీలు పార్టీ మారనున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. 2022లో ఏక్‌నాథ్ శిందే నాయకత్వంలోని 39మంది ఎమ్మెల్యేలు, కొందరు ఎంపీలు తిరుగుబాటు చేశారు.

దీంతో ప్రస్తుతం శివసేన (యూబీటీ) ఎంపీలు నిజంగానే శిందే వర్గంలో చేరతారా? లేక ఇది కేవలం రాజకీయంగా ఒత్తిడి సృష్టించే ప్రయత్నమేనా? అన్నది దిల్లీలో జరగనున్న సమావేశాల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవైపు ఎంపీల ఫోన్లు స్విచ్ ఆఫ్ కావడం, కీలక నేతలు దిల్లీలో మకాం వేయడం, వరుస భేటీలు మహారాష్ట్ర రాజకీయాల్లో మరో పెద్ద ట్విస్ట్‌కు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఎంపీలు నిజంగానే పార్టీ మారితే ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి మరో పెద్ద ఎదురుదెబ్బ తగలనుంది.

**తృణమూల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు**

మరోవైపు టీఎంసీలో కూడా రాజకీయ సంక్షోభం నెలకొంది. తిరుగుబాటు చేసిన 20 మంది ఎంపీలు ఇటీవల లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి, తాము నేషనల్ సిటిజన్స్? పార్టీ ఆఫ్? ఇండియాలో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. తిరుగుబాటు వర్గానికి చెందిన ఎంపీ అరూప్ చక్రవర్తి మాట్లాడుతూ, పార్టీని సరిదిద్దేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. పార్టీ ఎన్నికల గుర్తుపై కూడా తమ హక్కును చాటుకుంటామని పేర్కొన్నారు. అయితే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ఈ చర్యను పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి విరుద్ధమని అభివర్ణించింది.

# భారత్ ఆల్ టైమ్ రికార్డ్

భారత రక్షణ రంగం స్వయం సమృద్ధి దిశగా జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఆత్మ నిర్భర్ భారత్ పిలుపుతో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సరికొత్త మైలురాయిని అధిగమించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ రంగ ఉత్పత్తుల విలువ ఏకంగా రూ. 1.78 లక్షల కోట్లకు చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం. అంటే ఆల్ టైమ్ రికార్డుగా చెప్పొచ్చు. ఈ విషయాన్ని భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం అధికారికంగా వెల్లడించారు. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 15.6 శాతం ఎక్కువ. 2020-21 ఆర్థిక సంవత్సరంతో చూస్తే అంటే ఐదేళ్లలో రికార్డు స్థాయిలో 110 శాతం వృద్ధి నమోదు చేసింది. రక్షణ మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం దేశీయంగా తయారీ ఒకప్పటితో పోలిస్తే విపరీతంగా పెరగడం, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం మరింత విస్తరించడం, రక్షణ ఎగుమతులు గణనీయంగా పెరగడం ఈ భారీ వృద్ధికి దోహదపడింది. ఇవే ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. భారత రక్షణ రంగం సాధించిన ఘనతపై మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత రక్షణ ఉత్పత్తి ప్రతి ఏటా సరికొత్త శిఖరాల్ని అధిరోహిస్తుందని వ్యాఖ్యానించారు. '2025-26 ఆర్థిక సంవత్సరంలో భారత రక్షణ ఉత్పత్తి రూ. 1.78 లక్షల కోట్లకు చేరడం దేశ రక్షణ రంగ బలానికి నిదర్శనం.' అని సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిరంతర విధానపరమైన మద్దతు, కొత్త ఆవిష్కరణలతో రానున్న రోజుల్లో రక్షణ రంగం మరింత వేగంగా దూసుకెళ్తుందని



ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈసారి రక్షణ ఉత్పత్తిలో ప్రైవేట్ కంపెనీల పాత్ర మరింత పెరిగింది. మొత్తం రక్షణ రంగం ఉత్పత్తుల్లో 76 శాతం ప్రభుత్వ రంగ సంస్థల వాటానే. 24 శాతం వాటా ప్రైవేట్ రంగ కంపెనీలది. ఇక ఇందులో ప్రైవేట్ రంగ ఉత్పత్తి విలువ సుమారు రూ. 42 వేల కోట్లుగా ఉంది. గతేడాది 22 శాతంగా ఉన్న ఈ వాటా ఈసారి 24 శాతానికి చేరింది. దీంతో భారత రక్షణ రంగంలో ప్రైవేట్ కంపెనీల ప్రాధాన్యం పెరుగుతున్నట్లు సూచిస్తోంది.

**రికార్డు స్థాయికి రక్షణ ఎగుమతులు**

భారత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తితో పాటు ఎగుమతుల్లోనూ సరికొత్త చరిత్ర సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఎగుమతులు రూ. 38,424 కోట్లకు చేరి జీవన కాల గరిష్ఠాల్ని నమోదు చేశాయి. భారతదేశంలో తయారైన ఆయుధాలు, రక్షణ పరికరాలు, సాంకేతికతపై విదేశాల నమ్మకం పెరుగుతుందనేందుకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

గత కొన్నేళ్లలో చూస్తే 2013-14 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 43,746 కోట్లుగా ఉండగా అక్కడి నుంచి ప్రస్తుతం 4 రెట్లు పెరిగింది. 2020-21 లో రూ. 84,643 కోట్లుగా ఉండగా.. అక్కడితో డబుల్ అయింది. 2024-25 లో రూ. 1.54 లక్షల కోట్లు, 2025-26 లో రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదైంది. ఇది రక్షణ రంగం ఎదుగుదలను సూచిస్తోంది. భారత రక్షణ ఉత్పత్తి పెరగడం వల్ల విదేశీ ఆయుధాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. దేశీయ భద్రత మరింత బలోపేతం అవుతుంది. దేశీయంగా పరిశ్రమలకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఎగుమతులు పెరగడం వల్ల విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. అత్యాధునిక సైనిక సాంకేతికత మన దేశంలోనే అభివృద్ధి చెందుతుంది.

## భారత్‌పై దాడి జరిగితే అండగా ఉంటాం, కానీ



భారత్‌పై దాడి జరిగితే అమెరికా సైనిక సహకారం అందిస్తుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హామీ ఇచ్చారు. జీ7 సదస్సులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య అధికారికంగా ఎలాంటి రక్షణ ఒప్పందం లేనప్పటికీ, ట్రంప్ బహిరంగంగా ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం ప్రధాని మోదీతో భేటీ అనంతరం ఇరు దేశాల రక్షణ సంబంధాలపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. "మా మధ్య అధికారిక ఒప్పందాలేవీ లేవు. అయినప్పటికీ, భారత్‌పై దాడి జరిగితే మేము అండగా నిలవడానికి సిద్ధంగా ఉన్నాం" అని స్పష్టం చేశారు. అనంతరం ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ, "ఆయనపై ఎవరైనా దాడి చేస్తే మేము అండగా ఉంటాం. ఒకవేళ కొత్త నాయకుడు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తెలియదు కానీ, మోదీ నాయకత్వంలో భారత్‌కు మా పూర్తి సహకారం ఉంటుంది" అని వ్యాఖ్యానించారు. ఉభయ దేశాల మధ్య సంబంధాలు అసాధారణ స్థాయిలో బలపడ్డాయని ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ఒప్పందం కుదరవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ "చర్చల విషయంలో ఆయన చాలా నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. అత్యంత కఠినంగా వ్యవహరించే నాయకుల్లో ఆయన ఒకరు" అని కొనియాడారు. ఈ భేటీ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, గత ఏడాది వాషింగ్టన్‌లో జరిగిన సమావేశం తర్వాత ఇరు దేశాల సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోందని అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నంత కాలం వైట్‌హౌస్‌లో భారత్‌కు అత్యంత సన్నిహిత మిత్రుడు ఉంటాడని ఈ సందర్భంగా ట్రంప్ భరోసా ఇచ్చారు.

## సైబర్ నేరగాళ్లు సమాజానికి పరాన్నజీవులు

సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల సంపదను దోచుకునే 'పరాన్నజీవులు' అని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉందని సుప్రీంకోర్టు బుధవారం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఒక సైబర్ మోసం కేసులో నిందితుడికి బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. తనపై వివిధ రాష్ట్రాల్లో నమోదైన ఎఫ్ఐఆర్‌లను కలిపి విచారించాలని కోరుతూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఈ అంశంపై సంబంధిత హైకోర్టులను ఆశ్రయించాలని ధర్మాసనం సూచించింది. "మీలాంటి వారు పరాన్నజీవులు. అమాయక మదుపరుల నుంచి సొమ్ము వసూలు చేసి వారిని వంచిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో మేము అత్యంత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది" అని విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఈ తరహా నేరగాళ్లు తమిళనాడు నుంచి జమ్మూకశ్మీర్ వరకు దేశవ్యాప్తంగా అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి నేరస్థులను జైల్లోనే ఉంచడం సామాజిక ప్రయోజనాలకు శ్రేయస్కరమని ధర్మాసనం పేర్కొంది. దేశంలో "డిజిటల్ అరెస్ట్" వంటి స్కామ్‌లతో సహా ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ మోసాల ధాటికి వృద్ధులు, సామాన్యులు కోట్ల రూపాయలు మేర నష్టపోతున్నారని, అటువంటి వారిని కట్టడి చేసేందుకు కఠినమైన న్యాయపరమైన వైఖరి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

## దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్స్‌కు టూరిస్టుల ఫిదా! బ్రిటిష్ కాలంలోనే నిర్మాణం

చుట్టూ ఆకాశాన్ని తాకే హిమాలయ పర్వతాలు, మధ్యలో పచ్చని మైదానంలో ప్రకృతి సోయగాల మధ్య గోల్ఫ్ ఆట. ఇది వింటుంటేనే ఎంతో ఆహ్లాదంగా ఉంది కదూ. అలాంటి ప్రదేశం నిజంగా ఉందా? అనే సందేహం కూడా మొదలవుతుంది. కానీ అది నిజంగానే ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన గ్రీన్ గోల్ఫ్ కోర్సుల్లో ఒకటిగా పేరొందిన గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్ ప్రస్తుతం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ గోల్ఫ్ కోర్స్ వేసవిలో పచ్చదనంతో కళకళలాడుతుండగా, శీతాకాలంలో దట్టమైన మంచు దుప్పటి కప్పుకుని మరో అందాన్ని సంతరించుకుంటుంది. అరుదైన పూలతో ఉండే ఈ ప్రకృతి రమణీయ ప్రదేశాన్ని చూసేందుకు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యటకులు తరలివస్తున్నారు. కశ్మీర్?లోని గుల్మార్గ్‌లో సముద్ర మట్టానికి సుమారు 2,650 మీటర్ల (8,694 అడుగులు) ఎత్తులో ఉన్న ఈ గోల్ఫ్ కోర్స్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. పచ్చని మైదానాలు, చుట్టూ మంచు పర్వతాల నడుమ విస్తరించిన ఈ కోర్స్, గోల్ఫ్ క్రీడాకారులను మాత్రమే కాకుండా సాధారణ పర్యటకులను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది. 18 హోల్స్‌తో రూపొందించిన ఈ గోల్ఫ్ కోర్స్ భారతదేశంలోనే అత్యంత పొడవైన గోల్ఫ్ కోర్స్‌గా పేరుగాంచింది. ప్రతి ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఈ గోల్ఫ్ కోర్స్ సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. వేసవి, వర్షాకాలాల్లో పచ్చదనంతో మెరిసిపోతూ గోల్ఫ్ ప్రేమికులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తుంది. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వివిధ రకాల అడవి పూలు వికసించి ఈ ప్రాంత సౌందర్యాన్ని మరింత రెట్టింపు చేస్తాయి. శీతాకాలంలో భారీగా మంచు కురవడంతో గోల్ఫ్ కోర్స్ పూర్తిగా మంచుతో కప్పుకుపోతుంది. ఆ సమయంలో ఈ ప్రాంతాన్ని స్కీయింగ్, ఇతర శీతాకాల క్రీడల కోసం వినియోగిస్తారు. దీంతో ఏడాది పొడవునా గుల్మార్గ్ పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గుల్మార్గ్ గోల్ఫ్ కోర్స్‌కు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలన కాలంలో 1911లో దీనిని నిర్మించారు. అనంతరం 1922లో ఇక్కడ తొలి గోల్ఫ్ ఛాంపియన్‌షిప్ నిర్వహించారు. అప్పటి నుంచి ఇది అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు గుల్మార్గ్‌కు చేరుకుంటున్నారు. ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు గోల్ఫ్ ఆడుతూ తమ సెలవులను ఆనందంగా గడుపుతున్నారు.

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ వసతులు

-మొదటిపేజీ తరువాయి

కార్పొరేట్ వసతులు కల్పించే దిశగా తమ ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యపై తల్లిదండ్రులకు పలు అపోహలు ఉన్నాయని, వాటిని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణం చేపట్టినట్లు సీఎం తెలిపారు. విద్యాశాఖపై తమ ప్రభుత్వం 27 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థను నీరుగార్చిందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి పాఠశాలలోని తరగతి గదులను నిశితంగా పరిశీలిస్తూ క్యాంపస్ అంతా కలియతిరిగారు. ఈ సందర్భంగా అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించిన రేవంత్ రెడ్డి, తరువాత వారితో కలిసి కూర్చుని ఎంతో ఉత్సాహంగా అల్పాహారం తీసుకున్నారు. స్కూల్‌లోని అత్యాధునిక వంటగదిని పరిశీలించారు. వంట చేస్తున్న మహిళా సిబ్బందితో కలిసి సరదాగా ముచ్చటిస్తూ, స్వయంగా చపాతీలు (పూరీలు) ఒత్తి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం అక్కడ ఉన్న వారందరితో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు.

ఈ అంతర్జాతీయ స్థాయి మోడల్ పాఠశాలలో కల్పించిన అద్భుతమైన మౌలిక వసతుల గురించి విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ముఖ్యమంత్రికి క్షుణ్ణంగా వివరించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ క్యాంపస్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అధునాతన సైన్స్ ల్యాబ్‌లు, విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయం (లైబ్రరీ), హైటెక్ కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్‌తో పాటు ఆటల కోసం పెద్ద క్రీడా మైదానాన్ని కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఆయన పేర్కొన్నారు.

పుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే తనపై కొంత మంది విమర్శలు చేశారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామన్న ఆయన మెస్సీ డ్రగ్స్ ముఠా లీడర్ కాదు, ఆర్థిక నేరగాడు కాదని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే నెల రోజులకే చిరిగేవన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని తెలిపారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్ల టెండర్లతో పిలిస్తే అందులో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని మాజీ మంత్రి హరీశ్?రావు అంటున్నారని



పరోక్షంగా విమర్శలు గుప్పించారు. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2 వేల కోట్ల స్కామ్ ఎలా సాధ్యమో చెప్పాలని అన్నారు. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతామని పునరుద్ఘాటించారు.

**వంటగదిలో పూరి చేసిన సీఎం**

టీపీఎస్‌ను ప్రారంభించిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పాఠశాల ప్రాంగణంలో మొత్తం కలియతిరిగారు. ముందుగా కిచెన్‌లోకి వెళ్లారు. అక్కడి సిబ్బందితో కలిసి పూరీ చేశారు. అనంతరం అందరితో కలిసి ఫోటో దిగారు. తరగతి గదులను నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఐఏఎస్? ఆకునూరి మురళి తెలంగాణ పబ్లిక్ స్కూల్?కు సంబంధించిన అన్ని వివరాలను క్షుణ్ణంగా తెలిపారు. టీపీఎస్?ను కార్పొరేట్ స్కూల్ స్థాయిలో రూ.15 కోట్లతో ప్రభుత్వం నిర్మించింది. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్? బాబు, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్? రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, విద్యా కమిషన్ మాజీ ఛైర్మన్ ఆకునూరి మురళి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఇతరులు పాల్గొన్నారు.

కొత్త తరానికి సరికొత్త అవకాశాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్తుంటారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. విద్యకు పెద్దపీట వేసి, ప్రభుత్వ విద్యను తీర్చిదిద్దాలని చెప్తుంటారని, భావితరాల కోసం ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే యంగ్ ఇండియా స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్న ఆయన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తామన్నారు. అత్యుత్తమ విద్య, వైద్యం నినాదంతో సీఎం ముందుకెళు_న్నారని పేర్కొన్నారు.

ఈ వేడుకలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో పాటు ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మల్రెడ్డి రంగారెడ్డిలు పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, పలువురు ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కుటుంబానికి జీవనోపాధి

హనుమకొండలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటించారు. హనుమకొండ హనుమాన్‌నగర్‌లోని జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ (17) అనే అభిమాని ఇంటికెళ్లి పవన్ పరామర్శించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన నిరంజన్‌ను ఆప్యాయంగా పలకరించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్-మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ క్రమంలో వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? నిరంజన్?ను కాపాడుకోవడానికి ఏం ఏం అవకాశాలు ఉన్నాయన్న విషయంపై ఆరా తీశారు. భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఎల్లప్పుడు ఉంటాయని కుటుంబ సభ్యుల్లో మనో ధైర్యం నింపారు. వైద్య ఖర్చుల నిమిత్తం బాలుడికి రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

**వెంకటేశ్వరస్వామి తీర్థ ప్రసాదాలు**

తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు పవన్‌కల్యాణ్ కప్పారు. దేవుడి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అలాగే నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్‌కల్యాణ్‌ను అనుకరిస్తూ వేసిన డ్యాన్సు వీడియోలను చూశారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో నిరంజన్ ఆరోగ్యం కోసం ప్రత్యేక పూజలు చేయిస్తానని తెలిపారు. అలాగే భద్రకాళి అమ్మవారి ప్రతిమతో పూజలు జరిపి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.

**బాలుడికి ప్రేమతో పవన్ లేఖ**

బాలుడిని పరామర్శించిన పవన్? అతనికి చిరకాలం గుర్తుండిపోయేలా ఓ నోట్ రాశారు. "ప్రియమైన నిరంజన్‌కు ప్రేమతో.. దుర్గామాత ఆశీస్సులతో చల్లగా ఉండాలని కోరుకుంటున్నా" అని డైరీలో పవన్ కల్యాణ్ రాసి ఇచ్చారు.

తల్లిదండ్రుల జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు. నిరంజన్ తండ్రి గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవారని చెప్పారు. అలా వారి జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు క్యాంటిన్? పెట్టించాలని తెలంగాణ జనసేన నాయకులకి పవన్ తెలియజేస్తానన్నారు. అలాగే బాలుడిని పరామర్శిస్తున్న క్రమంలో అతను పవన్‌కల్యాణ్‌కు కుక్కపిల్ల బొమ్మను చూపి పెంచుకోవాలనిపిస్తుందని తెలిపారు. దీంతో కుక్కపిల్లను కొని పంపుతానని హామీ



ఇచ్చారు. దానిని పెంచుకోవడానికి స్వయంగా ఆ ఇంటి యజమానితో మాట్లాడి అనుమతి ఇప్పించారు.

కాగా బాలుడి పరామర్శ అనంతరం భద్రకాళి అమ్మవారిని పవన్?కల్యాణ్? దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో అర్చకులు పవన్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పవన్? కల్యాణ్ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా హనుమకొండలో పవన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. పవన్‌కల్యాణ్ బాబుని పరామర్శిచడంపై రాంగోపాల్,మానస సంతోషం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. "బాబుకి కిడ్నీ సమస్య ఉంది. ఎడమవైపు కిడ్నీ ఒకటి చిన్నగా ఉంది, కుడివైపుది పెద్దగా ఉంది. పవన్‌కల్యాణ్ మ్యూజిక్ వచ్చిందంటే బాబుకు కాళ్లు, చేతులు ఆగకపోయేది. మంచిగా డ్యాన్స్ చేసేవాడు. నాలుగు నెలల నుంచి ఏం అయ్యిందో గాని మొత్తం బెడ్‌కే అంకితం అయిపోయాడు. బాబుకు పవన్‌కల్యాణ్ అంటే చాలా ఇష్టం. ఇక్కడ బాబుని చోటా గబ్బర్‌సింగ్ అని చాలా మంది పిలిచేవారు"

**తెలంగాణ సీఎంకు పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు**

"ఈ రోజు నా వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ పోలీసు శాఖలోని ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను" పవన్?కల్యాణ్? ఎక్స్? వేదికగా రాసుకొచ్చారు.

# ప్రభుత్వ బడిలో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో కూడిన విద్య

రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్(టీపీఎస్)ను తీర్చిదిద్దింది. ఈ సంవత్సరం ప్రారంభించనున్న వంద పాఠశాలలకు ఇదీ రోల్‌మోడల్. సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు కలలకు ప్రతిరూపం. ప్రభుత్వం గతంలో ఆదర్శ పాఠశాలలు, గురుకులాలను అనేకం ప్రారంభించింది. అయితే ఈ పాఠశాలలకు టీపీఎస్?? భిన్నంగా ఉండటంతో ప్రజలందరి మన్ననలను అందుకుంటోంది. 30 మంది సభ్యులు ఉండే తల్లిదండ్రుల కమిటీని రూ.15 కోట్ల వ్యయంతో తీర్చిదిద్దిన తీరు అపూర్వం. ఈ పాఠశాలను సీఎం రేవంత్‌రెడ్డి నేడు అధికారికంగా ప్రారంభించారు. నేడు నాణ్యమైన విద్య పేదలకు అందని ద్రాక్షలా మారింది. ఈ నేపథ్యంలో నిరుపేద విద్యార్థులకు టీపీఎస్? ఆశాకిరణంలా మారింది. ఈ పాఠశాల పేద, మధ్య తరగతి వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తోంది. నాడు చాలీచాలని ఫర్నీచర్? - శిథిలమైన గదులు : ఒకప్పుడు ఆరుట్లలో ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, మరో ఆదర్శ పాఠశాల ఉండేవి. చాలీచాలని ఫర్నీచర్?, శిథిలమైన గదులు, బోధనోపకరణాల కొరత, అంతంత మాత్రం చదువులు ఇదీ మొన్నటి వరకు ఇక్కడి పాఠశాలల పరిస్థితి. విద్యార్థుల కొరతతో బాలికల పాఠశాల మూతపడింది. అయితే మిగిలిన పాఠశాలల్లో సుమారు 600 మంది విద్యార్థులు ఉండేవారు. నేడు ల్యాబ్‌లు - డిజిటల్ బోధన : అయితే తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలెట్ ప్రాజెక్టును అమలు చేయడానికి తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి ఆరుట్ల పాఠశాలను ఎన్నుకున్నారు. ఈ ప్రాంగణంలోని అన్ని పాఠశాలలను ఒకే గొడుగు కిందికి చేర్చారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం మొదలుపెట్టారు. గత సంవత్సరం జూన్ 12న పాఠశాల పునఃప్రారంభమయ్యాక టీపీఎస్ ప్రవేశాల కొరకు దరఖాస్తులు తీసుకున్నారు. కాగా దీనికోసం 2 వేల దరఖాస్తులు వచ్చాయి. అయితే అడ్మిషన్లను 1600కు పరిమితం చేశారు. కొత్తగా వచ్చిన వారిలో 72 శాతం మంది ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన వారే ఉన్నారు. పాఠశాలలో ల్యాబ్‌లు, డిజిటల్ బోధన, ఆటలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్ సహా మండలంలోని ఇతర గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఉన్నారు. ఈ నేపథ్యంలో వీరంతా రాకపోకలు సాగించేందుకు ఐదు బస్సులను ఏర్పాటు చేశారు. దీనికోసం విద్యార్థుల నుంచి నామమాత్రంగా రవాణా ఫీజు వసూలు చేస్తున్నారు. పాఠశాలలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేయాలన్నా పేరెంట్స్ కమిటీ ఆమోదించాల్సి ఉంటుంది. దీనికోసం 30 మందితో కమిటీ ఏర్పాటు చేసి ప్రతి శనివారం సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కమిటీ పర్యవేక్షణలో అన్ని పనులూ చేపడతారు. పాఠశాలలో ఖర్చు చేసే ప్రతి రూపాయికీ జవాబుదారీతనం ఉంటుంది. ఇక్కడ వసతుల కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు కేటాయించగా సోషల్ డెమోక్రటిక్ ఫోరం (ఎస్‌డీఎఫ్) రూ.3 కోట్లు విరాళంగా ఇచ్చింది.

## రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో వారికే తొలి ప్రాధాన్యత

-మొదటిపేజీ తరువాయి

అధికారులతో మంత్రి పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో సుమారు 75 వేల మంది తాము గుడిసెల్లో నివసిస్తున్నామని దరఖాస్తు చేసుకున్నారని క్షేత్రస్థాయిలో ఆ వివరాలు పరిశీలించి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు కూడా స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా అర్హులను గుర్తించాలని మంత్రి పొంగులేటి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెల్లో నివసిస్తున్న పేదలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లుగా ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గానికి రెండు వేల చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లను మంజూరు చేసినందువల్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ త్వరగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పేదల నివాస భద్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అసెంబ్లీ నియోజకవర్గానికి 500 చొప్పున తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50 వేల ఇళ్లను ఈ పథకం కింద ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. గోడలు, పునాదులు బలంగా ఉన్నప్పటికీ పైకప్పులు రేకులు, టార్పాలిన్ షీట్లు, నాపరాళ్లతో పాటు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ఇళ్లను గుర్తించి స్లాబ్ నిర్మాణం కోసం రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఇళ్ల పథకంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన పలు కీలక సూచనలు చేశారు.

**అసంపూర్తి ఇళ్లను మరోసారి పరిశీలించండి**

ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పాత ఇందిరమ్మ పథకం కింద మంజూరై బేస్‌మెంట్ లేదా పైకప్పు స్థాయిలో నిలిచిపోయిన ఇళ్లను కూడా ఈ పథకంలో చేర్చవచ్చని పేర్కొన్నారు. గృహలక్ష్మి పథకం కింద నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయిన గృహాలను కూడా గుర్తించి రూఫ్ అప్‌గ్రేడేషన్ కార్యక్రమం ద్వారా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఎల్‌సీ విధానంలో లబ్ధిదారుడే తన ఇంటిని నిర్మించుకొనే అవకాశం కల్పించామని పొంగులేటి తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో స్థలాల కొరతను దృష్టిలో పెట్టుకొని చిన్న స్థలాలున్న లబ్ధిదారులకు అవసరం మేరకు జీ ప్లస్ వన్ నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వవచ్చునన్నారు.

**అలా నిర్మిస్తే బిల్లులు మంజూరు కావు**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు పంచాయతీ సెక్రటరీలు క్షేత్రస్తాయికి వెళ్లి పరిశీలిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణంలో ఉన్న ఇళ్లకు సంబంధించిన ఫొటోలను తీసి యాప్‌లో అప్?లోడ్? చేస్తారు. అయితే ఆ ఫొటోలను పరిశీలించే బాధ్యతలను ప్రభుత్వం ఈసారి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్?)కి అప్పగిస్తోంది. ఈ ఫొటోలను ఏఐ స్కాన్ చేస్తోంది. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితి ప్రకారం నిర్మాణాలు చేపట్టిన వారిని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను ఇది సులభంగానే గుర్తిస్తోంది. ఇలాంటి నిర్మాణాలను 'అనర్హమైనవి'గా ఏఐ తేల్చేస్తోంది. మానవ ప్రమేయం లేకపోవటంతో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకూ లోనుకాకుండా ఇలాంటి అక్రమాలకు సులువుగా అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఏర్పడుతోంది. ఇదే తరహాలో ఇళ్ల నిర్మాణాల్లో అవకతవకలకు పాల్పడిన కొంతమంది హౌసింగ్ ఏఈలను గతంలో విధుల్లో నుంచి తొలగించిన సందర్భాలూ ఉన్నాయి.

## అభివృద్ధి పనుల్లో అవినీతి వరద

-మొదటిపేజీ తరువాయి

రూ.36.9 కోట్ల అక్రమార్జనను గుర్తించింది. లంచాలు తీసుకొని దొరికిన వారిలో, ఎవరి ఆస్తిని లెక్కించినా మార్కెట్ విలువ ప్రకారం రూ.100 కోట్లకు పైనే ఉంటుందని తేలింది. కాళేశ్వరం మాజీ ఈఎన్సీలు మురళీధర్‌రావు, భూక్యా హరిరామ్, ఇరిగేషన్ ఈఈ నూనె శ్రీధర్ నుంచి ఇటీవల అనిశాకు చిక్కిన, హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మర్రి వంశీమోహన్, ఈ నెలలో దొరికిన భుజంగరావు, మోహన్ నాయక్, నరహరిరావుల ఉదంతాలే ఇందుకు నిదర్శనం.

**లంచాల్లో మొదటి స్థానంలో పోలీసులే**

లంచాలు తీసుకొని ఏసీబీకి చిక్కుతున్న వారిని గమనిస్తే అధికంగా ప్రజలతో ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్న అధికారులే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. వీరంతా ప్రజలను లంచాలు ఇవ్వాలని పీడిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ సంవత్సరం ఏసీబీ చేసిన రైడ్లలో పోలీసు అధికారులే ఎక్కువగా ఉన్నారు. అన్యాయం జరిగిందని పోలీసుల దగ్గరకు వెళ్తే, అమాయకుల దగ్గర నుంచే పైసలు లాగుతున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్? 16 వరకు ఏకంగా 14 కేసులు పోలీసులపైనే నమోదు అయ్యాయి.

**తర్వాత స్థానంలో రెవెన్యూ డిపార్ట్‌మెంట్**

పోలీసుల తర్వాత అధికంగా లంచాలకు పాల్పడుతున్నది రెవెన్యూశాఖ. ప్రతి కుటుంబానికి నిత్య జీవితంలో రెవెన్యూ శాఖతో సంబంధం ఉంటుంది. దీనివల్ల ప్రతి ఒక్కరి దగ్గర ఎంతో కొంత లంచాలు తీసుకొనేందుకే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది. ఇక నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పంచాయతీ వ్యవహారాలను చూసేందుకు చాలా వరకు ప్రజలను లంచం అడుగుతున్నారు. ఈ విధంగా ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇదంతా అవినీతికి పరాకాష్ఠగా మారింది.

అక్రమార్జనలో అధికంగా లాగుతుంది మాత్రం అభివృద్ధి పనులు చేయిస్తున్న అధికారులనే తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వాలు రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నాయి. ఈ బాధ్యతలు తీసుకున్న అధికారులు అక్రమంగా లబ్ధి పొందుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నీటిపారుదలశాఖ చేసిన విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావు వద్ద రూ.9.42 కోట్లు గుర్తించగా, ఈఈగా పనిచేసిన నూనె శ్రీధర్ వద్ద రూ.7 కోట్లు, కాళేశ్వరం ఈఎన్సీగా పనిచేసిన భూక్యా హరిరామ్ వద్ద రూ.5.26 కోట్ల ఆక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.

**రవాణాశాఖలోనూ అధికంగా అక్రమార్జన**

రోడ్లు, భవనాల అభివృద్ధి అంటూ అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. వీటికి సంబంధించిన ఉదంతాలు ఇటీవలి కాలంలో ఎన్నో బయటపడ్డాయి. మహబూబ్?నగర్? రవాణాశాఖ ఉప కమిషనర్? కిషన్? రూ. 12.72 కోట్లు కూడబెట్టినట్లు బయటపడింది. ఈ నెలలో అదనపు ఎస్పీ (సస్పెన్షన్) భుజంగరావు రూ.5.92 కోట్లు, రోడ్లు, భవనాల శాఖ ఈఎన్సీ మోహన్‌నాయక్ రూ.17.94 కోట్ల అక్రమార్జన వెలుగులోకి వచ్చింది. తాజాగా మంగళవారం చిక్కిన ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్ డీడీ సుంకరి నరహరిరావు అక్రమార్జన రూ.13.05 కోట్లుగా తేల్చారు. ఈ ముగ్గురి ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో కనీసం రూ.500 కోట్లు ఉంటుంది.

**దూకుడు పెంచిన ఏసీబీ**

ఇలాంటి ఘటనలు అధికమవుతుండటంతో ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. దీంతో ఏసీబీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో అక్రమార్కుల చిట్టా ఒక్కొక్కటిగా బయటకు వస్తోంది. 2020లో ఈ కేసులు కేవలం 94 నమోదయ్యాయి. గత ఏడాది ఈ సంఖ్య 199కి చేరింది. అంటే ప్రతి రెండు రోజులకు ఒక కేసు చొప్పున వెలుగులోకి వస్తున్నాయి. అయినప్పటికీ కొంతమంది అధికారులు భయం లేకుండా యూపీఐ ద్వారా లంచాలకు పాల్పడుతున్నారు. వరంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినప్పుడు అక్కడున్న ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్‌లకు ఏజెంట్లు ఏడాది కాలంలో రూ.42,03,125 చెల్లించినట్లు గుర్తించారు.

**2025, 2026లో గుర్తించిన మొత్తం ఆస్తులు**

జూన్ 16 వరకు శాఖల వారిగా పోలీసు డిపార్ట్?మెంట్?లో 14 కేసులు, రెవెన్యూలో 13, మున్సిపల్ శాఖలో 8, పంచాయతీరాజ్?లో 8, విద్యాశాఖలో 6 కేసులు నమోదు అయ్యాయి. 2026 లో ఇలా రూ.36,92,84,217 విలువైన ఆస్తులు గుర్తించింది. అధికారిక విలువ ఇంతకు పదిరెట్లకు పైమాటే. 2025లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ రూ.96,13,50,554 విలువైన ఆస్తుల్ని గుర్తించింది. అనధికారికంగా వీటి విలువ కనీసం రూ.వెయ్యి కోట్లు ఉంటుంది.

నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
18 జూన్ 2026

## సంపాదకీయం

# మళ్లీ తెరపైకి డిలిమిటేషన్

జనాభా ఆధారిత డీలిమిటేషన్ ఫార్ములాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసి, దేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నందుకు తమకు సీట్లను తగ్గించి శిక్షిస్తారా? అని చంద్రబాబు నాయుడు, స్టాలిన్ వంటి నేతలు ఇప్పటికే బహిరంగంగానే ప్రశ్నించారు. ఒకవేళ కేంద్రం 50 శాతం పెంపు ఫార్ములాను మొండిగా ముందుకు తీసుకెళ్తే దక్షిణాది పార్టీలు ఖచ్చితంగా వ్యతిరేకిస్తాయి. అయితే, ఒకవేళ ప్రధాని ఆర్థిక సలహా మండలి ప్రతిపాదించిన 'టార్గెటెడ్ అండ్ వెయిటెడ్' పద్ధతిని ప్రవేశపెట్టి.. జనాభా నియంత్రించిన రాష్ట్రాలకు ప్రత్యేక వెయిటేజీ ఇస్తే మాత్రం దక్షిణాది పార్టీలు ఆ ఫార్ములాకు ఓటేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారినప్పటికీ, అది అమలు కావాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి కావడం సాంకేతికంగా అత్యంత కీలకం. ఉత్తరాదిలోని ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీలు కోటాలో కోటా ఓబీసీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ డిమాండ్ చేస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ బిల్లు, ఒక దేశం, ఒక ఎన్నిక బిల్లు రెండింటికీ పార్లమెంటరీ ఆమోదం పొందాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తున్నది. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపచేయడానికి ప్రభుత్వం గతంలో చేసిన ప్రయత్నానికి పార్లమెంట్‌లో అవసరమైన మద్దతు లభించకపోవడంతో ఈ అంశం మళ్లీ వెలుగులోకి వచ్చింది.అయితే, పార్లమెంట్‌లో ఎన్డీఏ బలం పెరుగుతున్న తరుణంలో, మహిళా ఓటర్ల మద్దతును పూర్తిగా స్వంతం చేసుకోవడానికి కేంద్రం ఈ రెండు బిల్లులను ఒకేసారి ముడిపెట్టి ఆమోదించే వ్యూహంతో ముందుకు వెళ్తోందిరాబోయే రోజుల్లో డీలిమిటేషన్ చర్చ కేవలం సీట్ల సంఖ్యకు పరిమితం కాకుండా.. భారతదేశ సమాఖ్య స్ఫూర్తి కి ఒక పెద్ద పరీక్షగా మారబోతోంది. మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో లభించిన 2/3 వంతు మెజార్టీతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందా, లేదా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సలహా మండలి సూచించిన సమతుల్య ఫార్ములా వైపు మొగ్గు చూపుతుందా అనేది తేలాల్సి ఉంద దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుపై రాజకీయ సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. గతంలో ఎన్డీఏ కూటమికి పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజార్టీ లేకపోవడం వల్ల ఈ రాజ్యాంగ సవరణల ప్రక్రియ సాధ్యం కాదనే చర్చ నడిచింది. అయితే, లోక్‌సభలో అనూహ్యంగా తృణమూల్ కాంగ్రెస్ కి చెందిన సుమారు 20 మంది ఎంపీలు ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం, ఇండీ కూటమిలోని సమాజ్‌వాదీ పార్టీ వంటి కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ కోసం సానుకూల సంకేతాలు ఇస్తుండటంతో మోదీ–షా ద్వయానికి అవసరమైన సంఖ్యాబలం సమకూరుతున్నట్లు స్పష్టమవుతోంది. అసలు డీలిమిటేషన్ ఏ ప్రాతిపదికన జరగబోతోంది? దక్షిణాది రాష్ట్రాల భవిష్యత్తు ఏంటి? ఈ ఫార్ములా ప్రకారం.. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సీట్ల సంఖ్యను నేరుగా దాదాపు 50 శాతం పెంచుతారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని కూడా ఇదే సంఖ్యాబలానికి అనుగుణంగా నిర్మించారు. కేవలం జనాభా ప్రాతిపదికన సీట్లను పెంచితే, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా సీట్లు పెరుగుతాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారిపోయాయి. తమిళనాడు ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్–డీఎంకే కూటమి విచ్ఛిన్నమైందన్న వార్తలు చర్చనీయాంశంగా ఉన్న కీలక పరిణామాల్లో ఒకటి. బిల్లుకు విస్తృత మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం డీఎంకేను సంప్రదించే ప్రయత్నాలను ప్రారంభించినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. అదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్‌లోని పరిణామాలను కూడా నిశితంగా గమనిస్తున్నారు. ఒకవేళ గణనీయ సంఖ్యలో ఎంపీలు టీఎంసీ నుంచి విడిపోతే అది పార్లమెంటరీ సమీకరణాలను మార్చివేసి బిల్లు ఆమోదానికి అవసరమైన మద్దతును కూడగట్టడంలో ప్రభుత్వానికి సులభతరం చేస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.పోయినసారి డీలిమిటేషన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టినపుడు దాని ఆమోదం పొందేందుకు ప్రభుత్వానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమైంది. అంటే బిల్లుకు అనుకూలంగా కనీసం 362 ఓట్లు అవసరం. అయితే బిల్లుకు 298 మంది సభ్యుల మద్దతు మాత్రమే లభించింది. బిల్లుకు వ్యతిరేకంగా 230 మంది ఎంపీలు ఓటు వేశారు. ఫలితంగా బిల్లుకు అవసరమైన సంఖ్యాబలం దక్కక సభలో వీగిపోయింది.జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్లు పెంచితే దేశ సమగ్రతకు, సమాఖ్య స్ఫూర్తికి నష్టం వాటిల్లుతుందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించింది. కేవలం జనాభాయే కాకుండా.. భౌగోళిక విస్తీర్ణం, ఆర్థిక వృద్ధి, అక్షరాస్యత వంటి వివిధ సూచీలను పరిగణనలోకి తీసుకుని 'టార్గెటెడ్ నియోజకవర్గాల విభజన' చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల ఉత్తరాదికి సీట్లు పెరిగినప్పటికీ, దక్షిణాది రాష్ట్రాలు మరీ ఘోరంగా నష్టపోకుండా ఒక సమతుల్యత సాధ్యమవుతుంది.

# పశ్చిమాసియా అపోహల నుంచి ఆశావాదం



పశ్చిమాసియా ప్రాంతం దశాబ్దాలుగా ప్రపంచ భౌగోళిక–రాజకీయాలకు ముఖ్య వేదికలలో ఒకటిగా నిలుస్తున్నది. అగ్రరాజ్యాలను అమితంగా ఆకర్షించే విస్తారమైన చమురు నిల్వలు; అంతర్జాతీయ వాణిజ్యానికి ఆయువుపట్టుగా ఉండే హొర్ముజ్, బాబ్ అల్ మాండెబ్, సూయజ్ వంటి అంతర్జాతీయ జలమార్గాలు ఈ ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యతను చేకూరుస్తున్నాయి. దీనికి తోడు మక్కా, మదీనా, కర్బలా, మషాద్, జెరూసలేం వంటి సున్నితమైన మతవిశ్వాస కేంద్రాలు కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. వీటన్నింటి కారణంగా, పశ్చిమాసియా నిరంతరం విభిన్న శక్తుల వ్యూహప్రతివ్యూహాలకు కార్యరంగంగా మారుతున్నది.

1979 ఇరాన్ ఇస్లామిక్ విప్లవం నేపథ్యంలో ఇరాన్–అమెరికా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ ఉద్రిక్తతలను కొంతవరకు తగ్గించే లక్ష్యంతో, ఆ రెండు దేశాల మధ్య 2015లో బరాక్ ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చారిత్రక అణు ఒప్పందం జాయింట్ కాంప్రెహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ కుదిరింది. అయితే, దాని నుంచి 2018లో అమెరికా ఏకపక్షంగా వైదొలిగిన తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఇరాన్ తన యురేనియం సుసంపన్నతను కేవలం పౌర అవసరాలకే పరిమితం చేయాలని, ప్రతిగా పశ్చిమ దేశాలు ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలనేది ఈ ఒప్పంద సారాంశం. అమెరికా ఆంక్షల కారణంగా ఆర్థిక వ్యవస్థ ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇరాన్ మాత్రం ఆంక్షలను పూర్తిగా ఎత్తివేస్తేనే చర్చలకు వస్తామని పట్టుబట్టింది. తన అణు కార్యక్రమాలను అంతర్జాతీయ ఒత్తిళ్లకు వెరవకుండా చాలావరకు ముందుకు తీసుకెళ్లింది కూడా.

ఈ చర్య–ప్రతిచర్యల పర్యవసానమే ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన ప్రత్యక్ష చర్యలని విశ్లేషకులు భావిస్తారు. ఉభయ దేశాల ప్రతిష్టంభన మధ్యలో ఇజ్రాయెల్ ఒక నిర్ణయాత్మకమైన పాత్ర పోషిస్తున్నది.


ఇరాన్ అణు సామర్థ్య విస్తరణను తన ఉనికికే ముప్పుగా భావిస్తున్న ఇజ్రాయెల్ -- నతాంజ్, ఇస్ఫహాన్ వంటి అణు, క్షిపణి మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని, ప్రత్యక్ష వైమానిక, డ్రోన్ దాడులు, సైబర్ వ్యూహాలకు పాల్పడింది. బదులుగా, ఇజ్రాయెల్ వ్యూహాత్మక స్థావరాలు, డిమోనా వంటి సున్నిత అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ నేరుగా; అలాగే దాని మద్దతు ఉన్న హమాస్, హెజ్బొల్లా వంటి శక్తుల ద్వారా దాడులకు పాల్పడటం ఇరు పక్షాలలో ఉన్న అభద్రతాభావాన్ని, అపనమ్మకాన్ని సూచిస్తున్నది. వాషింగ్టన్ దౌత్యవిధానాలు, ఆర్థిక ఆంక్షల ద్వారా ఇరాన్‌ను నియంత్రించాలని చూస్తుంటే; ఇజ్రాయెల్ మాత్రం ప్రత్యక్ష కార్యాచరణకే మొగ్గు చూపింది.

ఇటీవలి ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ / రోరింగ్ లయన్ దాడుల్లో ఇరాన్ సుప్రీమ్ లీడర్ అలీ ఖమేనీ సహా ఉన్నత నాయకులు లక్ష్యం చేసుకోబడ్డారని నివేదికలు వెలువడ్డాయి. బదులుగా ఇరాన్ తన ఆపరేషన్ ట్రూ ప్రామిస్ ×ఒ ద్వారా ఇజ్రాయెల్ లక్ష్యాలు, బహ్రెయిన్, కతార్, యూఏఈ వంటి అమెరికా ప్రాంతీయ స్థావరాలపై పలుదఫాలుగా మిస్సైల్, డ్రోన్ దాడులు జరిపింది. ఈ ప్రతిదాడులు ఎర్ర సముద్రం నుంచి హొర్ముజ్ వరకు వాణిజ్యానికి అంతరాయం కలిగించి, ప్రాంతీయ ఉద్రిక్తతలను తారాస్థాయికి చేర్చాయి. అయితే ఏప్రిల్‌లో కాల్పుల విరమణ అమలు అయిన తర్వాత, జూన్ 14–15 నాటికి అమెరికా–ఇరాన్ మధ్య ప్రాథమిక అవగాహన కుదిరింది. అబ్రహం ఒప్పందాలు ఆర్థిక, సాంకేతిక, పర్యాటక రంగాలలో సహకారానికి కొంతవరకు తోడ్పడ్డాయి.

దశాబ్దాలుగా వెంటాడుతున్న ప్రధాన భద్రతా, రాజకీయ సమస్యలు ఇంకా యథాతథంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, విభేదాలను మరింత పెంచే సైనిక చర్యల కంటే, ప్రాంతీయ శక్తుల మధ్య సమగ్రమైన దౌత్య సంప్రదింపులు, అన్ని పక్షాల భద్రతా ఆకాంక్షలను గౌరవించే దీర్ఘకాలిక శాంతి ప్రణాళికలు మాత్రమే పశ్చిమాసియాను స్థిరత్వం వైపు నడిపించగలవు. ఇటీవలి అమెరికా–ఇరాన్ ప్రాథమిక అవగాహన వంటి పరిణామాలు ఈ దిశలో మరో ముందడుగుగా చూడవచ్చు. అయితే ఒప్పందం పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. అమెరికా, ఇరాన్ వైపు నుంచి ఏకపక్షంగా వెలువడుతున్న వివరాలలో హస్తిమశకాంతరం ఉండటం అనిశ్చితిని, అనుమానాలను పెంచుతున్నది.

అంతేగాక, పరస్పరం అంగీకరించిన షరతుల అమలులో ఉభయపక్షాల చిత్తశుద్ధి, ఒప్పందం పట్ల ఇజ్రాయెల్ దృక్పథం వంటి అంశాలు ఈ దీర్ఘకాలిక అవగాహన భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, ఇజ్రాయెల్‌ను పూర్తి స్థాయిలో సంప్రదించలేదని లేదా ఒప్పంద వివరాలతో ఆ దేశం అసంతృప్తిగా ఉన్నదని తెలుస్తున్నది. భారతీయ స్టాక్ మార్కెట్లు, రూపాయి విలువలో హఠాత్తుగా కనిపించిన మెరుపులు వాస్తవాల ఆధారంగా ఉన్నాయా, లేదా అత్యుత్సాహంతో కూడుకున్న ఊహాజనిత ఆశావాదం మాత్రమేనా! అనే విషయం ఇంకా సందిగ్ధంగానే ఉన్నది. ఒప్పందం సంతకం అయి, దాని పూర్తి వివరాలు వెలువడిన తర్వాత కాలమే ఈ సంశయాన్ని తీర్చుతుంది.

# తగ్గుతున్న జననాల రేటు



ప్రపంచ జనాభాలో భారతదేశం 2023లో చైనాను వెనుకకు నెట్టి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది. ప్రస్తుతం మనదేశ జనాభా 147 కోట్ల పైచిలుకుగా ఉన్నది. అయితే క్రమంగా జననాల రేటు తగ్గుతుండటంతో మరో 20 ఏండ్లల్లో జనాభా గ్రాఫ్ నేలచూపులు చూడటం ఖాయమని నిపుణుల అంచనా. జననాల రేటు వేగంగా పడిపోతుండటమే అందుకు కారణం. వార్షిక పెరుగుదల రేటు 1961లో 2.41 శాతం ఉండగా ప్రస్తుతం అది 0.86 శాతం వద్ద కొనసాగుతున్నది. ప్రస్తుత జనాభా రేటు స్థిరంగా కొనసాగాలంటే ప్రతి మహిళ సగటున 2.1 శిశువులకు జన్మనివ్వాల్సి ఉండగా 1.9 జననాలు మాత్రమే నమోదవుతున్నాయి. భారతదేశంలో పడిపోతున్న జననాల రేటు సంతానోత్పత్తి సంక్షోభాన్ని స్పష్టం చేస్తున్నది. ఇలా ఎందుకు జరుగుతున్నది అనేది ఆలోచించాల్సిన విషయం. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోయి సామాజికార్థిక విపరిణామాలు చోటుచేసుకొనే ప్రమా దం తొంగిచూస్తున్నది. జననాల రేటు పడిపోవడం అనేది ఏదో యథాలాపంగా జరుగుతున్న పరిణామం కాదు. దీని వెనుక పెద్ద సమస్యే ఉన్నదని నిపుణులు చెప్తున్నారు.

జనాభా గణాంకాలకు అతీతంగా, ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై విధాన నిర్ణేతలు ప్రత్యేకించి దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. పెరుగుతున్న వంధ్యత్వం, ఆలస్యంగా తల్లిదండ్రులు కావడం, జీవనశైలి సంబంధిత ఆరోగ్య సమస్యలు, సంతానోత్పత్తిపై తక్కువ అవగాహన వంటివి దీనికి కారణాలని సంతానోత్పత్తి నిపుణులు చెప్తున్నారు. ప్రత్యుత్పత్తి ఆరోగ్యం అనేది కేవలం వ్యక్తిగత సమస్యగా మిగిలిపోకుండా, క్రమంగా ప్రజా ఆరోగ్య సమస్యగా మారుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఇది భారతీయులు కుటుంబ నియంత్రణను అనుసరించే విధానాన్ని ప్రభావితం చేస్తున్నది. ఈ సమస్యలో రెండు పార్శ్వాలున్నాయి. ఒకటి, సామాజిక, ఆర్థిక కారణాల వల్ల ఐచ్ఛికంగా పిల్లలను వద్దనుకొనే, లేదా పరిమితంగా కనే ధోరణి పెరుగుతుండటం. రెండు, దాంతోపాటే సంతానం కావాలనుకున్నవారికి కలుగకపోవడం. ఈ రెండో జాబితాకు చెందిన జంటలు సంతానోత్పత్తి చికిత్సా కేంద్రాలను ఆశ్రయించడం అంతకంతకూ పెరుగుతున్నది. సంతానలేమికి దారితీసే అనారోగ్య పరిస్థితుల వెనుక జీవనశైలితో పాటుగా పర్యావరణ సమస్యలూ ఉండటం గమనార్హం. ఎంత ఆలస్యమైతే సం తాన సాఫల్యత అవకాశాలు అంతగా మృగ్యం అవుతుండటం కొట్టొచ్చినట్టు కనబడే అంశం. వివిధ ప్రాంతాల్లో సంతానోత్పత్తి రేట్లలో భౌగోళిక, సామాజిక, ఆర్థిక అంశాలు తేడాలు కలిగిస్తున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హెచ్చుతగ్గులుండటం సర్వసాధారణం. అయితే ఇక్కడ ప్రత్యేకించి గమనించాల్సింది ఉత్తర, దక్షిణ తేడాలు. భారతదేశ జనాభా కథ ఏకరీతిగా లేదు.

యూపీ, బీహార్ సహా ఏడు ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు జాతీయ సగటు మించి 2.5–3.0 శాతంగా ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలలో వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతుండగా, వృత్తిఉద్యోగాల పేరిట ఇతర ప్రాంతాలకు వలస వెళ్లేవారి సంఖ్య మందగిస్తున్నది. ఉత్తరాది రాష్ట్రాలలో యువ జనాభా అధికంగా ఉండటంతో వలసల స్వరూప స్వభావాలే మారిపోతుండటం మనం చూస్తున్నాం. ఒకప్పుడు దుబాయ్ వంటి విదేశాల్లో పనికి వెళ్లేవాళ్లలో దక్షిణాది వారిదే పైచేయిగా ఉండేది. ఇప్పుడు యూపీ, బీహార్ ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉండటం గమనార్హం.

దేశంలో జనాభా తగ్గుముఖం పట్టడం, అందులో భౌగోళిక తేడాలు ఉండటం తేలికగా తీసుకునే వ్యవహారం ఎంత మాత్రం కాదు. ఈ చర్చ కేవలం జనన గణాంకాలకే పరిమితం కాకుండా, పునరుత్పత్తి ఆరోగ్యం మరియు శ్రేయస్సుపై మరింత విస్తృతంగా దృష్టి పెట్టాలి. పునరుత్పత్తి ఆరోగ్యం గురించి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంచేందుకు విధాన నిర్ణేతలు కృషి చేయాలి. పునరుత్పత్తి ఆరోగ్యాన్ని ప్రజారోగ్య సమస్యగా గుర్తిస్తేనే ఈ సమస్యలకు తెరపడుతుంది.

## ఎరువుల గోదాంలు విక్రయ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ బి. సత్యప్రసాద్



**నవగీతం, జూన్17,జగిత్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు.బుధవారం జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామం లోని పీఏసీఎస్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ బి. సత్యప్రసాద్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా అప్ ద్వారా విక్రయాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..రైతులకు కావలిసిన యూరియా నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. అప్ ద్వారా యూరియా బుక్ చేసుకుని కొనుగోలు చేయాలని సూచించారు.సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన గోదాముల నిర్మాణానికి సంబంధించి పనులు తక్షణమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ ను ఆదేశించారు.జగిత్యాల రూరల్ మండలం జాబితాపూరు గ్రామంలో గోదాముల నిర్మాణానికి సంబంధించి ప్రదిపాదిత స్థలాన్ని పరిశీలించారు.జిల్లాలో పెరుగుతున్న పంటల దిగుబడికి అనుగుణంగా గోదాముల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాబార్డ్ సహకారంతో సహకార శాఖ ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాముల నిర్మాణం తో జాబితాపూరు ప్రాంతం జిల్లాలో ధాన్యం నిల్వ కేంద్రం గా మారుతుందని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గోదాముల నిర్మాణాన్ని పరిశీలించారు.అదేవిధంగా అంతర్గాం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు.ఈ పరిశీలనలో జిల్లా సహకార అధికారి చెరుకు మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి.భాస్కర్, ఏ డి ఏ నాయక్, రూరల్ తాశీల్దార్ హకీం మరియు తదితరులు ఉన్నారు.

## పాఠశాల అభివృద్ధికి గ్రామ సర్పంచుల కృషి అభినందనీయం

**--మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి**



**నవగీతం,జూన్17, మల్లాపూర్ ప్రతినిధి:** మల్లాపూర్ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరియు విద్యార్థుల నమోదు పెంపునకు చేస్తున్న కృషి అభినందనీయమని మండల విద్యాధికారి కేతిరి దామోదర్ రెడ్డి తెలిపారు. బడిబాట కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు విద్యార్థుల చేర్పుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్రామస్థులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులను ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా రాఘవపేట ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్, ఉపసర్పంచ్ మద్దెల నర్సయ్యలు మాజీ ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యుడు అమీనుద్దీన్ కుమార్తె తో పాటు మరో పది మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించి వారికి పాఠ్యపుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో మల్లాపూర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు. అంతేకాకుండా 29 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ (=+ఖఖు)లో సీట్లు సాధించడం మండల విద్యా రంగానికి గొప్ప విజయమని పేర్కొన్నారు.మండలంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాధికారి విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని, వారి సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఇదే విధంగా విద్యాభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని, తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.


## కుర్నవల్లి గ్రామంలో ఖమ్మం డీపీఓ పర్యటన

**పారిశుధ్య పనులు వైద్య శిబిరం పరిశీలన**




**తల్లాడ,జూన్17, నవగీతం ప్రతినిధి:** మండలం కుర్నవల్లి గ్రామాన్ని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) టి. రాంబాబు బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రస్తుతం కొనసాగుతున్న పారిశుధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని డీపీఓ సందర్శించారు. స్థానిక ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్న ఆయన.. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందించారు.?కుర్నవల్లి గ్రామానికి చెందిన పాగా జోజి జూన్ 16 న తెల్లవారుజామున మృతి చెందారు. మృతికి గల కారణాలను ఈ సందర్భంగా డీపీఓ మీడియాకు వివరించారు. జోజి గత రెండు నెలలుగా జ్వరం, తీవ్రమైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. మొదట ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో, ఆ తర్వాత హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారని, చివరగా సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరారని పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రి వైద్యులు జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రం (డెత్ సర్టిఫికేట్) ప్రకారం.. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా వైఫల్యం చెందడం వల్లే ఆయన మరణించారని డీపీఓ స్పష్టం చేశారు.?గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజల ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులను డీపీఓ ఆదేశించారు.?ఈ పర్యటనలో డీపీఓతో పాటు తల్లాడ ఎంపీడీఓ, కుర్నవల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి మరియు స్థానిక వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సర్కార్ బడికి పంపిస్తే ఇంటి పన్ను నల్లా బిల్లు మాఫీ. :సర్పంచ్ ఏం రాజు.



**నవగీతం, జూన్ 17 (ఇల్లంతకుంట, ప్రతినిధి)** విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో బుధవారం రోజున మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలను, నోట్ బుక్ లను సర్పంచ్ ఏం రాజు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏం రాజు మాట్లాడుతూ ఇల్లంతకుంట గ్రామానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాల కి ఈ విద్య సంవత్సరం నుండి వచ్చే విద్యార్థుల ఇంటి పన్ను, నల్లా బిల్లు మాఫీ చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పడానికి మన జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పదవ తరగతిలో 500 కు పైగా మార్కులు నిదర్శనం అని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసుకోకుండా ఇక్కడ ఉపాధ్యాయులు బోధిస్తున్నారు అని అన్నారు. మన పాఠశాల ఉపాధ్యాయుడు మహేష్ చంద్ర అంతర్జాతీయ స్థాయిలో పిన్ ల్యాండ్ పారిజాతం ఎంపిక ఇవ్వడం మన గ్రామ విద్యా రంగానికి గర్వకారణం అన్నారు. అక్కడ నేర్చుకున్న ఆధునిక విద్యా విధానాలను మన విద్యార్థులకు అందించి పాఠశాలను మరింత ఉన్న స్థానంలో నిలపాలని అన్నారు. గ్రామపంచాయతీ తరపున పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా 2025 26 విద్య సంవత్సరం లో 500 పైగా మార్కులు వచ్చిన 23 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సర్పంచ్ సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. ప్రేమలత, ఉప సర్పంచ్ నాగరాజు శర్మ,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కే.వినోద, స్థానిక వార్డుమెంబర్ చేరాల వంశీ ,ఉపాధ్యాయులు వి. మహేష్ చంద్ర, ఐ. ప్రదీప్ రెడ్డి, ఎస్.మధుసూదన్ రావు, మంజుల, ఎమ్. లత, పి. అనిల్ కుమార్, పి. సునీత, ఏ. కవిత, పి. స్వప్న, సి.హెచ్. సంపత్ రావు, వి. సరిత, సి.హెచ్.సునీత, చొక్కయ్య , ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరిక




**నవగీతం, జూన్ 17,(కొడిమ్యాల ప్రతినిధి):** చొప్పదండి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మ్యాడంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ గాతం అంజయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిలిటరీ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్, మనాల సర్పంచ్ పాపారావు, దిండు ప్రవీణ్, అమరేందర్ రెడ్డి, బేక్కం రాజ గంగయ్య, శ్రవణ్, జంపా హరీష్, మహేష్, గుర్రాల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు.

## నాడు కరీంనగర్ లో.. నేడు ధర్మపురి లో..

**వెల్గటూర్ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి..**



**నవగీతం,జాన్17,జగిత్యాల/ వెల్గటూర్:** గత బీఆర్ ఎస్ ప్రభుత్వ కాలంలో కళ్యాణ లక్ష్మి చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల కొరకు లబిద్దారులు కరీంనగర్ వెళ్లే పరిస్థితి ఉండేదని నేడు ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లోనే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో నలుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులతో పాటు 91 మంది లబ్ధిదారులకు రూ 31 లక్షల 3వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కరీంనగర్ లో అందించే వారని ఇది పేద ప్రజలకు భారంగా ఉండేదని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ధర్మపురి నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లబ్ధిదారులతో పాటు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల సైతం స్థానికంగా అందజేస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి విడత పంపిణీ చేసిన ఇందిరమ్మ ఇల్లు పూర్తి కావడానికి వస్తున్నాయని గృహ ప్రవేశాలకు వెళ్లిన సందర్భంలో పేదల ముఖాల్లో ఆనందం కనిపిస్తుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రానున్న రోజుల్లో మరింత మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

**గౌడన్న లకు అండగా నిలుస్తాం..**

వెల్గటూర్ మండలం జగదేవ్ పేట గ్రామంలో ఇటీవల దగ్ధమైన ఈత వనాన్ని మంత్రి లక్ష్మణ్ కుమార్ పరిశీలించారు. అగ్ని ప్రమాదంతో జరిగిన తీరును, నష్టం వివరాలను స్థానిక గౌడ సంఘం నాయకులు మంత్రికి వివరించారు. నష్టపోయిన గౌడన్నలకు ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. జగదేవ్ పేట గ్రామంలో బైపాస్ రోడ్డు నిర్మాణం తో పాటు పెద్దమ్మ ఆలయంలో బోరుబావి తవ్వించడంతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్ మిగిలిన పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరగా గ్రామస్తులు కోరిన పను లు పూర్తి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నాం..

**ప్రతి ఊరికి ఇందిరమ్మ ఇళ్లు..**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**






**నవగీతం,జూన్17,జగిత్యాల/ ఎండపల్లి:** ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల స్వంతింటి కల నెరవేర్చుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కొండాపూర్ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లలో 9 ఇళ్ల పూర్తి కాగా బుధవారం గృహ ప్రవేశాలు నిర్వహించారు. గృహప్రవేశ వేడుకలకు హాజరైన మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఏనాడు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో రాష్ట్రంలోని పేద ప్రజల సొంతింటి కలను నిజం చేస్తూ ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఒక డబుల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణం చేయలేదని మంత్రి అన్నారు. ధర్మపురి నియోజకవర్గాన్ని నియంతల ఏలిన కొప్పుల ఈశ్వర్ ఏనాడైనా ఒక గ్రామంలో ప్రభుత్వం తరపున నిర్మించిన గృహప్రవేశంలో పాల్గొన్నారా అని ప్రశ్నించారు. పేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లపై సైతం బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధిగా గృహప్రవేశ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని మంత్రి తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రానున్న రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సు ద్వారా ఉద్యోగావకాశాలు ప్రిన్సిపల్ డాక్టర్ కే.వేంకయ్య ప్రకటన



**నవగీతం, జూన్17,మెట్ పల్లి ప్రతినిధి:** కృత్రిమ మేధస్సు ద్వారా ఉద్యోగావకాశాలు బాగా పెరుగుతాయని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య ప్రకటించారు.అక్క - అన్న మెంటర్షిప్ ప్రోగ్రాం లో భాగంగా జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రోజున కృత్రిమ మేధస్సు - డిజిటల్ లెర్నింగ్ అన్న అంశంపై అవగాహన కార్యక్రమం ప్రారంభమయ్యింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య మాట్లాడుతూ, భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు ద్వారా ఉద్యోగావకాశాలు బాగా పెరుగుతాయని, ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ట్రైనర్ ఎస్ సందీప్ మాట్లాడుతూ, విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం అక్క - అన్న మెంటార్షిప్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఫ్యాకల్టీ మెంటర్స్ టీ.దేవన్న, బి.రాజేందర్, ఏ.మనోజ్ కుమార్ లతోపాటు బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థినీ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ నిర్మాణానికినిధులు మంజూరు చేయండి



**నవగీతం,జూన్17,మెట్ పల్లి ప్రతినిధి:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ లేదని, అందుకోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ జగిత్యాల జిల్లా కలెక్టర్ కు ఆ కళాశాల ప్రిన్సిపాల్ నేతృత్వంలో సిబ్బంది వినతి పత్రంను సమర్పించారు. కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణం లేదని, దాంతో కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని నివారించటానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య అధ్వర్యంలో సిబ్బంది వినతి పత్రంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, కళాశాల అకాడమిక్ కో - ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవగీతం తెలుగు దినపత్రిక

గురువారం
18 జూన్ 2026

# ఎమ్మెల్యే ద్వంద్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారు

**జగిత్యాల అభివృద్ధిపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి**

**కేంద్ర విద్యాలయ స్థలం కేటాయింపును అడ్డుకుంటున్నది ఎవరు..?**

**జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి**



**నవగీతం,జూన్17, జగిత్యాల ప్రతినిధి :** బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి జగిత్యాల నియోజకవర్గ కార్యాలయం కమల నిలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారిక కార్యక్రమంలో కనీస మర్యాదలను పాటించకుండా ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను విస్మరించడం బాధాకరమని అన్నారు. సభా మర్యాదల గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకు ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమాల్లో పెయిడ్ బ్యాచ్‌లతో పార్టీ నినాదాలు చేయించడం, కావాలనే రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరించడం కాంగ్రెస్ నాయకులకే అలవాటైందని విమర్శించారు. గత పాలకులు హుందాతనంతో వ్యవహరించారని, వారిని చూసైనా ప్రస్తుత ప్రజాప్రతినిధులు నేర్చుకోవాలని సూచించారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకుండా కార్యక్రమాన్ని ముగించిన విషయాన్ని గుర్తు చేశారు. కోరుట్ల పట్టణం అభివృద్ధి, జగిత్యాల పట్టణం అభివృద్ధి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా అధికార పార్టీలో ఉన్న సమయంలో సెంట్రల్ డివైడర్లను రాళ్లతో కాకుండా కాంక్రీట్‌తో నిర్మించాలని అధికారులకు లేఖ రాసింది మీరే కాదా అని ప్రశ్నించారు. గతంలో ఎంపీ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తానని చెప్పి కేంద్ర మంత్రులను కూడా కలిపించారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే స్వార్థ రాజకీయాల కారణంగానే కేంద్ర విద్యాలయానికి వాలంటరీ స్థలాన్ని కేటాయించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వాలంటరీ స్థలంలో జరుగుతున్న అక్రమ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అమృత్ 2.0 పథకం కింద రాయికల్‌కు రూ.15 కోట్లు, జగిత్యాలకు రూ.38.60 కోట్లు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. శంకుస్థాపన చేసి సంవత్సరం గడిచినా పనులు ముందుకు సాగకపోవడం దురదృష్టకరమన్నారు. యావర్ రోడ్ విస్తరణ విషయంలో ఎమ్మెల్యే, చైర్మన్, కౌన్సిలర్లు కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డును 100 అడుగులకు విస్తరించేందుకు గెజిట్ ఇప్పటికే విడుదలైందని, కొలతలు పూర్తయ్యి సంబంధిత ఏజెన్సీకి చెల్లింపులు కూడా జరిగాయని తెలిపారు. అయినప్పటికీ కొత్తగా కొలతల పేరుతో డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమైతే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకుంటానని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుని ప్రజల మధ్య తిరగాలని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రాజకీయ బాగోతాలను ఒక్కొక్కటిగా ప్రజల ముందుకు తీసుకొస్తామని హెచ్చరించారు. భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, జిల్లా కోశాధికారి సుంకేట దశరథరెడ్డి, సిరిపురపు శ్రీనివాస్, గట్టుపల్లి జ్ఞానేశ్వర్, దూరిశెట్టి మమత, ఓడ్నాల రమేష్, గుండేటి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్







**జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్**

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..**

**వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం**

**నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత**

**వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**నవగీతం,జూన్17,హన్మకొండ:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతోపాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్ కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్ కళ్యాణ్ ని కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రివర్యులు బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు. చలించిపోయిన శ్రీ పవన్ కళ్యాణ్ నిరంజన్ ను చూసేందుకు వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు. నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ ని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్ గారితోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

## అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ ఉక్కుపాదం..!

**ఇందిరమ్మ ఇండ్ల పేరుతో సాగిన ఇసుక దందా బట్టబయలు**

**వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలో అక్రమ ఇసుక మాఫియాపై మైనింగ్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ కొరడా ఝుళిపించింది. ఇందిరమ్మ ఇండ్లు, నేషనల్ హైవే పనుల పేరుతో అక్రమంగా కొనసాగుతున్న ఇసుక రవాణాపై మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి మొత్తం 15 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుంది. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డీజీ డి.ఎస్. చౌహన్, హైదరాబాద్ రూరల్ ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు యాలాల, తాండూర్ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను గుర్తించి అడ్డుకున్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న డ్రైవర్లు, కూలీలు ట్రాక్టర్లను అక్కడికక్కడే వదిలేసి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 9 ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసిన అధికారులు, మిగిలిన వాహనాల యజమానులు, నిర్వాహకుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, నేషనల్ హైవే పనుల పేరుతో కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారని అధికారులు గుర్తించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

## ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే

**గుడిసెలు వేసుకున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**హనుమకొండ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, లేకపోతే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగి ప్రభుత్వంపై తిరుగుబాటు అనివార్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ జిల్లా గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో నిర్మించిన "సురవరం సుధాకర్ రెడ్డి నగర్" సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ప్రభుత్వ భూములపై గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత ఇల్లు లేదని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని అన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో అనేక ప్రాంతాల్లో భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని, పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు అనుకూల

## "ఆర్ఎస్ఎస్ కార్యాలయం పై దాడిని ఖండించిన భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు"



**నవగీతం,జూన్17, జగిత్యాల ప్రతినిధి:** జార్ఖండ్ రాజధాని రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం పై గుర్తుతెలియని ఇద్దరు దుండగులు పెట్రోల్ బాంబులతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నాయకులు ఏసీఎస్ రాజు చిట్ల గంగాధర్ లు మాట్లాడుతూ...హిందుత్వ శక్తులు బలపడటం మోడీ నాయకత్వంలో దేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదగడాన్ని జీర్ణించుకోలేని కొన్ని మతతత్వ శక్తులు ఇలాంటి దాడులకు తెగబడుతున్నాయి అని ఆర్ఎస్ఎస్ ఒక దేశభక్తి కలిగిన సంస్థ అని ఆర్ఎస్ఎస్ దృష్టిలో ఏదైనా దేశం తర్వాతేనని దేశానికి గాని సమాజంలో గాని ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందు నిలిచేది ఆర్ఎస్ఎస్ అని దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసే సంస్థని అలాంటి సంస్థ ఎదుగుదలను జీర్ణించుకోలేని శక్తులు ఇలాంటి దాడులకు తెగ బడుతున్నాయని ఇలాంటి దేశ వ్యతిరేక శక్తుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి నాయకులు సింగం గంగాధర్ వేముల పోచమల్లు ఇల్లెందుల పురుషోత్తం కొత్తకొండ బాలన్న నరేంద్ర శ్రీనివాస్ ఎడమల వెంకటరెడ్డి బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించిన కౌన్సిలర్ దొంతేబోయిన వెంకటేశ్వర్లు



**నవగీతం , జూన్17,వైరా ప్రతినిధి:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11 వార్డు సోమవారం లో వార్డు కౌన్సిలర్ దోంతేబోయిన వెంకటేశ్వర్లు విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలకతో అక్షరాభ్యాసం ను ఆయన చేయించారు .అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొంతేబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని వారి భవిష్యత్తుకు బాల్యంలోనే పునాది వేయాలని ఉపాధ్యాయులు భావితరాల భవిష్యత్తును నిర్ధారించే విధంగా తీర్చిదిద్దాలని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లిలా మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలో అక్షరాభ్యాసం




**నవగీతం, జూన్17,ఇబ్రహీంపట్నం ప్రతినిధి:** ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తనుగుల రమేష్ మాట్లాడుతు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న గ్రామస్తులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గత పాలకవర్గం లేని సమయంలో కాంగ్రెస్ నాయకులు దేశెట్టి జీవన్, జాన శంకర్ లు పాఠశాలకు ఎంతో అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. సామూహిక అక్షరాభ్యాసం తో పాటు విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాపల్లి మహేష్, పుప్పాల మహేష్, డబ్బా మాజీ విడిసి అధ్యక్షులు జాన శంకర్, కాంగ్రెస్ యువ నాయకులు జీవన్, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మి, సుంకరి రాజేష్, ఉపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ, అశోక్, నరేష్, హరి ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## చైతన్యపురిలో పోలీస్ అభ్యర్థుల మహా ధర్నా

**హైదరాబాద్ :** పోలీస్ నియామకాల్లో వయోపరిమితి పెంపుతో పాటు పెండింగ్లో ఉన్న నోటిఫికేషన్లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ పోలీస్ అభ్యర్థుల జేఏసీ ఆధ్వర్యంలో చైతన్యపురిలో మహా ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పోలీస్ అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, 19/20 పే స్కేల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కానిస్టేబుల్ పోస్టులకు 36 సంవత్సరాలు, ఎస్ఐ పోస్టులకు 38 సంవత్సరాల వయోపరిమితి కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.

## బిజినెస్

### హైదరాబాద్‌లో అమెజాన్ మరో గోదాం

**ముంబై :** ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ దేశవ్యాప్తంగా మరో 100 ప్రత్యేక అర్బన్




ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను ప్రారంభించింది. ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌ల్లో ఈ గిడ్డంగ్‌లను ఆరంభించినట్టు ప్రకటించింది. మెట్రో నగరాల్లో డెలివరీని మరింత వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ఈ సెంటర్లను నెలకొల్పినట్టు, అలాగే క్విక్ కామర్స్ సేవలను మరో 100 నగరాలకు విస్తరించనున్నట్టు తెలిపింది. దుస్తులు, ఎలక్ట్రానిక్స్, ఆభరణాలు, ఫర్నిచర్, సరుకులే కాకుండా, పర్సనల్ కేర్, ఫ్యాషన్, బ్యూటీ ప్రొడక్ట్స్‌లపై ప్రత్యేక రాయితీతో విక్రయిస్తున్నది. ఈ నెల 23న ప్రారంభంకానున్న ప్రైమ్ డే ఆఫర్లు నాలుగు రోజులపాటు జరుగనున్నది.

### 2026 కవాసకి నింజా 500 లాంచ్: ధర ఎంతంటే?



ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ కవాసకి భారత మార్కెట్‌లో కొత్త '2026 నింజా 500' బైక్ లాంచ్ చేసింది. దీని ధర మునుపటి మోడల్ కంటే రూ.1000 ఎక్కువ. దీంతో ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.5.76 లక్షలు. కొత్త నింజా 500లో పెద్దగా యాంత్రిక మార్పులు చేయలేదు. అయితే 2026 మోడల్‌ను ఈ20 ఇంధన ప్రమాణాలకు అనుగుణంగా అప్‌డేట్ చేశారు. దీంతో భవిష్యత్ ఇంధన విధానాలకు అనుగుణంగా ఈ బైక్ సిద్ధంగా ఉంది. అలాగే కవాసాకి ప్రత్యేకమైన లైమ్ గ్రీన్ కలర్ స్కీమ్‌లో ఈ బైక్ అందుబాటులోకి వచ్చింది. ఈ బైక్‌ను 2024లో విడుదల చేసిన నింజా 400కు వారసుడిగా కంపెనీ పరిచయం చేసింది. ఇందులో 451 సీసీ లిక్విడ్ కూల్డ్ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌ను అందించారు. ఈ ఇంజిన్ 44.38 బీహెచ్‌పీ పవర్, 42.6 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 6–స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్ కూడా ఇందులో ఉంది. దీంతో రైడింగ్ అనుభవం మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. సస్పెన్షన్ వ్యవస్థలో ముందు భాగంలో టెలిస్కోపిక్ ఫోర్క్స్, వెనుక భాగంలో మోనోషాక్ సస్పెన్షన్‌ను కొనసాగించారు. బ్రేకింగ్ కోసం ముందు 310 మిమీ డిస్క్, వెనుక 220 మిమీ డిస్క్ బ్రేక్‌లను అందించారు. ఇవి మెరుగైన నియంత్రణ, భద్రతను అందిస్తాయి. డిజైన్ విషయానికి వస్తే, నింజా సిరీస్‌కు ప్రత్యేకమైన స్పోర్టీ లుక్ పొందుతుంది. ట్విన్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్, షార్ప్ ఫెయిరింగ్ లైన్స్, ఆకర్షణీయమైన ఫ్రంట్ డిజైన్ బైక్‌కు ప్రీమియం లుక్‌ను ఇస్తాయి. అలాగే ఫుల్ ఎల్సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో పాటు స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ సదుపాయం కూడా ఉంది. ఈ బైక్‌లో 785 మిమీ సీటు ఎత్తు, 14 లీటర్ల ఫ్యూయల్ ట్యాంక్, 171 కిలోల కర్బ్ వెయిట్ వంటి అంశాలు కొనసాగుతున్నాయి. మొత్తం మీద 2026 కవాసాకి నింజా 500లో పెద్ద మార్పులు లేకపోయినా, ఈ20 అనుకూలతతో పాటు కొత్త రంగు ఎంపికలను జోడించడం ద్వారా కంపెనీ ఈ మోడల్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చింది.

# సూచీల పరుగులు

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్ల లాభాల పరంపర కొనసాగుతున్నది. వరుసగా నాలుగో రోజు బుధవారం కూడా సూచీలు ఒక్క శాతం వరకు బలపడ్డాయి. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అమెరికా–ఇరాన్ దేశాల మధ్య శాంతిచర్చలు కొలిక్కి రావడంతో సూచీలు పరుగులు పెట్టాయి. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 347.14 పాయింట్లు లాభపడి 77,155.62 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 96.55 పాయింట్లు ఎగబాకి 24,085.70 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 80 డాలర్ల దిగువకు పడిపోవడం, పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో మదుపర్లలో సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

ట్రెంట్ షేరు 7 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు హెచ్‌ఏఎల్, బీఈఎల్, హిందాల్కో, ఎటర్నల్, ఎస్బీఐలైఫ్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్, నెస్లె, టెక్ మహీంద్రా, ఎయిర్‌టెల్, టీసీఎస్, సన్‌ఫార్మా, బజాజ్ ఆటో, టైటాన్, ఎస్బీఐ, కోల్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ, విప్రో, ఇండిగో షేర్లు లాభాల్లో ముగిశాయి.

కానీ, మారుతి, డాక్టర్ రెడ్డీస్, కొటక్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఓఎన్‌జీసీ, సిప్లా, టీఎంపీవీ కంపెనీల షేర్లు పతనం చెందాయి.

రంగాలవారీగా క్యాపిటల్ గూడ్స్ సూచీ 2.76 శాతం బలపడగా, ఇండస్ట్రీయల్స్ 1.83 శాతం, పీఎస్‌యూ బ్యాంకింగ్ 1.80 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 1.39 శాతం, పవర్ 1.19 శాతం, మెటల్ 1.15 శాతం చొప్పున బలపడ్డాయి.



22.78 లక్షల కోట్లకు మదుపర్ల సంపద

బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ మరోసారి 5 ట్రిలియన్ డాలర్ల మార్క్‌ను అధిగమించింది. గత నాలుగు రోజుల్లో మదుపర్ల సంపద రూ.22.78 లక్షల కోట్లు పెరిగి ఈ కీలక మైలురాయిని అధిగమించడానికి దోహదం చేసింది. వరుసగా నాలుగు రోజులుగా సూచీలు కదంతొక్కడంతో మదుపర్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, అమెరికా–ఇరాన్ దేశాల మధ్య శాంతిచర్చలు కొలిక్కి రావడంతో గత నాలుగు రోజుల్లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 3,323.07 పాయింట్లు లేదా 4.50 శాతం, నిఫ్టీ 924 పాయింట్లు 3.98 శాతం ఎగబాకింది. దీంతో గత నాలుగు సెషన్లలో మదుపర్ల సంపద రూ.22.78 లక్షల కోట్లు పెరిగి రూ.4,75,12,374.27 కోట్ల(5.03 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.

## అదానీ చేతుల్లోనే పవర్

**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో థర్మల్ పవర్ టెండర్లన్నీ అదానీ గ్రూప్‌నకే**

**ఇక 25 ఏండ్లపాటు రూ.13.27 లక్షల కోట్ల ఆదాయం**

**న్యూఢిల్లీ :** దేశంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని బొగ్గు ఆధారిత విద్యుత్తు కొనుగోలు కాంట్రాక్టులన్నీ గౌతమ్ అదానీయే హస్తగతం చేసుకున్నారు. దశాబ్దకాలం తర్వాత 2024లో కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలిక థర్మల్ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను పునరుద్ధరించింది. అయితే ఇందులో అదానీ గ్రూప్ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. 2024 మార్చి–2026 జనవరి మధ్య 12 దీర్ఘకాలిక బొగ్గు ఆధారిత విద్యుత్తు కొనుగోలు కాంట్రాక్టులకు బిడ్లను ఆహ్వానించారు. వీటిలో 8 కాంట్రాక్టులు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఉన్నాయి. అవన్నీ కూడా ఏదో ఓ రకంగా అదానీ గ్రూప్‌నకే దక్కడం గమనార్హం. దీంతో రాబోయే 25 ఏండ్లలో రూ.13.27 లక్షల కోట్లకుపైగా ఆదాయం కంపెనీకి పక్కా అయిపోయింది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ సర్కారీ పెద్దలు అదానీ గ్రూప్‌నకు అనుకూలంగా నిబంధనల్ని మార్చారా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతంలో 'రిపోర్టర్స్ కలెక్టివ్' సైతం ఇదే నివేదించింది. అయితే తాము పారదర్శకంగా ఈ బిడ్లను దక్కించుకున్నామని అదానీ గ్రూప్ చెప్తున్నది.



**మహారాష్ట్రలో..**

మహారాష్ట్ర ప్రభుత్వం అటు బొగ్గు ఆధారిత విద్యుత్తును, ఇటు సౌర విద్యుత్తును ఒకే సంస్థ నుంచి కొనుగోలు చేసేలా టెండర్‌ను జారీ చేసింది. అలాగే తప్పనిసరైన రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ముందస్తు అనుమతినీ తీసుకోకుండా నిబంధనల్ని ఉల్లంఘించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థల అవసరాలను పరిగణనలోకి తీసుకొనే సదరు కమిషన్ టెండర్స్‌ను ఆమోదిస్తుంది. అలాగే బిడ్డింగ్‌లో పాల్గొన్న పలు కంపెనీలూ ప్రభుత్వ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఇలా మిగతా రాష్ట్రాల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తుండటం గమనార్హం.

## రెండో వన్డేలో అఫ్గాన్ చిత్తు..

# సిరీస్ భారత్ సొంతం

లక్నో వేదికగా అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో వన్డేలో 170 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2–1 తేడాతో టీమిండియా సొంతం చేసుకుంది. భారత్ నిర్ధేశించిన 403 పరుగుల టార్గెట్‌ను ఛేధించలేక అఫ్గాన్ చతికల పడింది. పర్యాటక జట్టు లక్ష్య ఛేధనలో భారత బౌలర్ల ధాటికి 44.3 ఓవర్లలో 232 పరుగులకు ఆలౌటైంది. అఫ్గానిస్తాన్ బ్యాటర్లలో రెహమత్ షా(79) టాప్ స్కోరర్‌గా నిలవగా.. గుర్బాజ్(41), అటల్(42) పర్వాలేదన్పించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ తలా మూడు వికెట్లు సాధించారు. వీరిద్దరితో పాటు అరంగేట్ర ప్రిన్స్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు సాధించి టీమిండియా ఆలౌట్ అయింది. శుబ్‌మన్ గిల్ (154), ఇషాన్ కిషన్ (125) సెంచరీలతో కదం తొక్కారు. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో వన్డే జూన్ 20న చెన్నై వేదికగా జరగనుంది.




## శుబ్‌మన్ సరికొత్త చరిత్ర.. తొలి భారత క్రికెటర్‌గా



టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఐపీఎల్–2026లో దుమ్మురేపిన గిల్.. ఇప్పుడు అదే జోరును అఫ్గానిస్తాన్ సిరీస్‌లో కనబరుస్తున్నాడు. లక్నో వేదికగా అఫ్గాన్‌తో రెండో వన్డేలో గిల్ అద్భుతమైన సెంచరీతో చెలరేగాడు. కేవలం 77 బంతుల్లోనే తన 9వ వన్డే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 110 బంతులు ఎదుర్కొన్న గిల్.. 22 ఫోర్లు, 2 సిక్స్‌లతో 154 పరుగులు చేశాడు. ఈ అద్భుత శతకంతో వన్డే క్రికెట్‌లో 3000 పరుగుల మైలురాయిని దాటాడు. తద్వారా వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు చేసిన భారత ఆటగాడిగా గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ ఫీట్‌ను గిల్ కేవలం 62 ఇన్నింగ్స్‌లలో అందుకున్నాడు. గతంలో ఈ రికార్డు శిఖర్ ధావన్, శ్రేయస్ అయ్యర్(72 ఇన్నింగ్స్‌లు) పేరిట సంయుక్తంగా ఉండేది. తాజా నాక్‌తో వారిద్దరిని శుబ్‌మన్ అధిగమించాడు. బంతులు పరంగా ఈ ఫీట్ సాధించిన జాబితాలో మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్(2995) అగ్రస్థానంలో ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో గిల్(3016) ఉన్నాడు. అదేవిధంగా వన్డేల్లో ఫాస్టెస్ట్ 150 చేసిన మూడో ప్లేయర్‌గా వీరేంద్ర సెహ్వాగ్‌ను గిల్ అధిగమించాడు. సెహ్వాగ్ 2011లో వెస్టిండీస్‌పై 112 బంతుల్లో ఈ ఫీట్ సాధించగా.. అఫ్గాన్‌తో మ్యాచ్‌లో గిల్ కేవలం 108 బంతుల్లో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ జాబితాలో ఇషాన్ కిషన్(103) అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది.

## స్పోర్ట్స్

## భారత్ అదుర్స్.. నెదర్లాండ్స్‌పై భారీ విజయం




**లీడ్స్ :** మహిళల టీ20 ప్రపంచకప్ తొలి పోరులో దాయాది పాకిస్థాన్ భరతం పట్టిన భారత్ మలి మ్యాచ్‌లో చిన్న జట్టు నెదర్లాండ్స్‌ను ?తచిత్తుగా ఓడించింది. బుధవారం ఏకపక్షంగా సాగిన లీగ్ పోరులో95 పరుగుల తేడాతో డచ్‌పై భారీ విజయం సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన(47 బంతుల్లో 74), షెఫాలీ వర్మ (55) అర్ధసెంచరీలతో తొలుత భారత్ 20 ఓవర్లలో 209/5 స్కోరు చేసింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. మంధాన, షెఫాలీ తొలి వికెట్‌కు 115 పరుగులు జోడించగా, రీచాఘోష్(8 బంతుల్లో 20 నాటౌట్) ధనాధన్ ఆటతీరుతో భారత్ 200 మార్క్ అందుకుంది. లక్ష్యఛేదనలో తెలుగు స్పిన్నర్ శ్రీచరణి(4/19) ధాటికి డచ్ టీమ్ 17.3 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. చరణికి తోడు షెఫాలీ(3/20), నందినిశర్మ(2/22) దెబ్బకు నెదర్లాండ్స్ కెప్టెన్ డీ లీడె(28), హీథర్ సీజర్స్(21) మినహా అందరూ స్వల్ప స్కోర్లకు పెవిలియన్ చేరారు. మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



# లంకా దహనం సీత చేస్తే..

అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ 'ఆల్ఫా' సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా 'ఆల్ఫా' పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. 'సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా' అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.




# మరో మార్క్ దాటేసిన 'పెద్ది'

రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా మరో ఘనత సాధించింది. ఇప్పటికే ప్రేక్షకుల్ని అలరించిన ఈ చిత్రం.. ఇప్పుడు కలెక్షన్లలో రూ.400 కోట్ల మార్క్ ని అందుకుంది. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. పోస్టర్‌ని సోషల్ మీడియాలోనూ పంచుకున్నారు. విలేజీ స్పోర్ట్స్ డ్రామాగా తీసిన 'పెద్ది' సినిమాలో రామ్ చరణ్.. క్రికెటర్, రెజ్లర్, పారా రన్నర్‌గా కనిపించాడు. విడుదలకు ముందు చాలానే హైప్ ఏర్పడింది గానీ టాక్ మాత్రం తేడా కొట్టేసింది. సినిమా చూసిన చాలామంది రామ్ చరణ్ యాక్టింగ్ బాగుందని మెచ్చుకున్నారు కానీ కథ పరంగా లోటుపాట్లు ఎత్తిచూపారు. మరీ ముఖ్యంగా జాన్వీ కపూర్ చేసిన అచ్చియమ్మ పాత్రని చూపించిన విధానంపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. దీంతో అనుకున్నంత వసూళ్లు రాలేదనేది వాస్తవం. జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన సీన్స్ తీసేశారు. దర్శకుడు బుచ్చిబాబు కూడా సారీ చెప్పాడు. ఇలా ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూ వచ్చిన 'పెద్ది' సినిమా ఎట్టకేలకు రూ.400 కోట్ల కలెక్షన్ల మార్క్‌ని అయితే దాటేసింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన తెలుగు చిత్రంగా ఇది ఘనత సాధించింది. మరి రూ.500 కోట్లు వస్తాయా అంటే సందేహమే. ఎందుకంటే థియేటర్లలో ఈ చిత్రం హవా దాదాపుగా తగ్గిపోయింది. మరో రెండు వారాలు ఆగితే ఓటీటీలోకి కూడా వచ్చేస్తుంది. అదే టైంలో స్కూల్స్ కూడా తెరిచేశారు కాబట్టి ఫ్యామిలీ ఆడియెన్స్ థియేటర్లకు వచ్చే అవకాశం పెద్దగా లేదని చెప్పొచ్చు.

# 'మైసా'లో నక్సలైట్‌గా?

అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.





# సేవ్ ది టైగర్స్' సీజన్ 3 ప్రీమియర్ సక్సెస్

సోమవారం సాయంత్రం హైదరాబాద్ ఏఎమ్‌బీ సినిమాస్‌లో 'సేవ్ ది టైగర్స్ సీజన్ 3' గ్రాండ్ ప్రీమియర్ వేశారు. దీనికి అద్భుతమైన స్పందన లభించింది. పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరు కాగా వారితో పాటు అతిథులు, నటీనటులు, సాంకేతిక బృందం.. ఇలా అందరూ కలిసి సీజన్3ని ఎంజాయ్ చేశారు. సేవ్ ది టైగర్స్ 3 స్పెషల్ సెలబ్రిటీ ప్రీమియర్ వేడుకలో హీరో సందీప్ కిషన్, కామాక్షి భాస్కర్ల, రాగ్ మయూర్, బిగ్ బాస్ తెలుగు 5 విజేత వీజే సన్నీ, కళ్యాణ్ పడాలా (బిగ్ బాస్ సీజన్ 9 విజేత), చైతన్య రావు, వెంకటేష్ కాకుమాను, కార్తిక్ రత్నం, ఆదిత్య మండల, శ్రీనాథ్ మాగంటి, జబర్దస్త్ కమెడియన్ ముక్కు అవినాష్, నిరుపమ్, కిరీటి దామరాజు, మానస్ తదితరుల పాల్గొన్నారు. సేవ్ ది టైగర్స్ సీజన్ 3.. ఈ శుక్రవారం నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.